


PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ,రంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 12, ఎడిటర్,చెరుకు ఉపేందర్, పేజీలు : 8, వెల రూ. 5, శనివారం - 14 - జూన్ - 2025

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## ఎలా బతికానో కూడా తెలియదు



న్యూఢిల్లీ : అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంలో మొత్తం 265 మందికి(ఇప్పటిదాకా అధికారిక లెక్కల ప్రకారం) మరణించారు. విమానం నుంచి ప్రాణాలతో బయటపడింది రమేష్ ఒక్కడే. ప్రస్తుతం సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతన్ని ప్రధాని మోదీ పరామర్శించి ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు.

## 'ఏపీలో శాంతి భద్రతలు క్షీణించాయి'



ఢిల్లీ: ఏపీలో శాంతి భద్రతలు దిగజారి పోయాయన్నారు వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి. ఇందుకు అనంతపురం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై టీడీపీ నేతల అత్యాచారానికి పాల్పడిన ఘటనలే ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

2లో

## ఆ ఒక్క ప్రయాణికుడు ఎలా తప్పించుకున్నాడో తెలుసా?



అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం ప్రమాదం
265 మంది మృతి.. ప్రాణాలతో బయటపడిన ఒకే ఒక్కడు
టేకాఫ్ అయిన వెంటనే విమానం ముక్కలైందన్న విశ్వాస్ కుమార్
సీటుతో సహా బయటపడటంతో అగ్నికీలల నుంచి తప్పించుకున్న ప్రయాణికుడు

## ట్యాపింగ్ కేసు.. వ్యూహం మార్చిన సిట్



ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును సిట్ అధికారులు ముమ్మరం

హైదరాబాద్: సుదీర్ఘకాలం అమెరికాలో తలదాచుకున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు తిరిగి రావడం, ఆయన విచారణ పర్వం కొనసాగుతుండటంతో అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును సిట్ అధికారులు ముమ్మరం చేశారు. విచారణ అధికారులు

# గురుకులాల్లోనూ డే స్కాలర్ చదువు అందిద్దాం

## సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయండి

పట్టణాలు, నగరాల్లో ప్రభుత్వ పాఠశాలలు పెంచండి

విద్యాశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: "నాణ్యమైన భోజనం, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందిస్తుండటంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారు. అలాంటిచోట్ల మౌలిక వసతులను సంపూర్ణంగా వినియోగించుకునేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చి చదువుకొని... ఇళ్లకు వెళ్లేలా డే స్కాలర్లకూ అవకాశం ఇవ్వడంపై అధ్యయనం చేయండి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన



## ఫార్ములా-ఈ రేసు కేసు కేటీఆర్‌కు మళ్లీ ఏసీబీ నోటీసులు




- నెల 16న ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాలని ఆదేశం
- గత నెలలో అమెరికా పర్యటన కారణంగా విచారణకు హాజరుకాని కేటీఆర్
- రూ.55 కోట్ల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు
- కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా అర్వింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డి




## తెలంగాణ వ్యాప్తంగా వానలు...

### హైదరాబాద్‌లో రోడ్లపైకి నీరు, ట్రాఫిక్ కష్టాలు

తెలంగాణ అంతటా విస్తరించిన నైరుతి రుతుపవనాలు
రాష్ట్రంలో రాబోయే ఐదు రోజులు వర్ష సూచన
దక్షిణ, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

## కుమారుడి అడ్మిషన్ కోసం పటాన్‌చెరు వెళ్లిన పవన్ కల్యాణ్



## విజయ్ భాయ్ ఇక లేరంటే నమ్మలేకపోతున్నాను: ప్రధాని మోదీ

అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ దుర్మరణం
రూపానీ కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ
"విజయ్‌భాయ్ ఇక లేరనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నాను" అంటూ ప్రధాని ఆవేదన
రూపానీతో తనకున్న ఏళ్లనాటి స్నేహాన్ని, కలిసి పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్న మోదీ
నిరాడంబరుడు, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడిన నేతగా రూపానీకి నివాళి
ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డ ఏకైక వ్యక్తిని కూడా ఆసుపత్రిలో పరామర్శించిన ప్రధాని

న్యూఢిల్లీ : గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత విజయ్ రూపానీ అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మరణించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విజయ్ రూపానీ కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# 28 గంటల్లో బ్లాక్ బాక్స్ స్వాధీనం చేసుకున్నాం

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో కీలక పరిణామం

ప్రమాదం జరిగిన 28 గంటల్లోనే ఫ్లైట్ డేటా రికార్డర్ (బ్లాక్ బాక్స్) లభ్యం

ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) స్వాధీనం

విచారణకు ఈ పరికరం అత్యంత సహాయకారి అన్న కేంద్ర మంత్రి

కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎక్స్‌లో వెల్లడి




న్యూఢిల్లీ : అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ విమానానికి చెందిన బ్లాక్ బాక్స్‌ను అధికారులు నేడు స్వాధీనం చేసుకున్నారు. ఈ దుర్ఘటనలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి

## గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ మృతి పట్ల పవన్ కల్యాణ్ సంతాపం



- అహ్మదాబాద్ వద్ద కూలిన ఎయిర్ ఇండియా విమానం
- గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ సహా 241మంది మృతి
- ఆయన మృతిపట్ల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ దిగ్భ్రాంతి.. ప్రగాఢ సంతాపం
- లండన్‌లో కుటుంబాన్ని కలిసేందుకు వెళ్తుండగా ఈ ఘోర దుర్ఘటన
- విమాన ప్రమాదంలో మరణించిన రెండో గుజరాత్ సీఎంగా విజయ్ రూపానీ

అమరావతి : గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత విజయ్ రూపానీ (68) నిన్న అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే.

# ఇది చంద్రబాబు నిరంకుశత్వానికి చెంపపెట్టు అన్న వైఎస్ జగన్

## సుప్రీం తీర్పుతో చంద్రబాబు కుట్ర బట్టబయలైందని వ్యాఖ్య


- కొమ్మినేనికి సుప్రీంలో ఊరట లభించడంపై జగన్ స్పందన
- అమరావతి మహిళలపై వ్యాఖ్యల కేసులో కొమ్మినేనికి సుప్రీంకోర్టులో ఊరట
- సీనియర్ జర్నలిస్టును వెంటనే విడుదల చేయాలన్న సుప్రీం ఆదేశాలు
- ప్రజల దృష్టి మరల్చేందుకే చంద్రబాబు కృత్రిమ వివాదం సృష్టించారని ఆరోపణ
- కొమ్మినేనికి సంబంధం లేని వ్యాఖ్యలు ఆపాదించారని జగన్ విమర్శ




అమరావతి : అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యల కేసులో సీనియర్ పాత్రికేయుడు, సాక్షి చానల్ న్యూస్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించడంపై వైసీపీ అధినేత జగన్ స్పందించారు. "సత్యమేవ జయతే" అంటూ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు గారిని వెంటనే విడుదల చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు చంద్రబాబు గారికి పెద్ద చెంపపెట్టు.

# పేర్ని నాని పాపం పండింది.. అవినీతి సొమ్ము కక్కిస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర

- మాజీ మంత్రి పేర్ని నానిపై కొల్లు రవీంద్ర ఫైర్
- తప్పు చేసిన వారిని చట్టం వదిలిపెట్టదని తీవ్ర హెచ్చరిక
- టిడ్కో ఇళ్లు, సీఆర్జెడ్ భూముల కేటాయింపులపై పేర్ని నానిని నిలదీత
- మెడికల్ కాలేజీ భూ సేకరణలో రూ.8 కోట్ల అవకతవకలు జరిగాయని ఆరోపణ
- పేర్ని నాని సానుభూతి రాజకీయాలకు కాలం చెల్లిందని విమర్శ




అమరావతి : వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నానిపై రాష్ట్ర గనులు, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పేర్ని నాని పాపం పండిందని,

# ఎలా బతికానో కూడా తెలియదు

మొదటి పేజి తరువాయి

ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. మరికొన్ని జాతీయ మీడియా సంస్థలు కూడా ఆయన నుంచి వివరాలు సేకరించే ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే.. "నమ్మలేకపోతున్నా.. ఎలా బతికానో కూడా తెలియట్లేదు" అంటూ అతను చెబుతున్నాడు. విమానంలో 11ఏ సీట్‌లో కూర్చున్న రమేష్.. ఎమర్జెన్సీ విండో నుంచి దూకి ప్రాణాలు రక్షించుకున్నారంటూ తొలుత పోలీసులు చెప్పారు. అతని సోదరుడు ధీరేంద్ర సోమ్‌బాయ్ కూడా అదే స్టేట్‌మెంట్ ఇచ్చారు. అయితే రమేష్ మాత్రం జరిగింది అది కాదని స్పష్టత ఇచ్చారు. అంతా క్షణాల్లో జరిగిపోయిందని, తమ విమానం నేలకూలుతుందన్న విషయం తనకు అర్థమైంది. ఆ వెంటనే విమానం కిందకు వచ్చి ముక్కలై.. పేలిపోయిందని.. ప్రమాద క్షణాలను గుర్తు చేసుకున్నారు. 40 ఏళ్ల బ్రిటిష్ ఇండియన్ అయిన విశ్వాష్ కుమార్ రమేష్.. ఏదో అద్భుతం జరిగినట్లే ప్రమాదం నుంచి బయటడ్డారు. ప్రమాద సమయంలో విమానం నేలను తాకి రెండు ముక్కలైంది. ఆ సమయంలో సీటు ఎగిరి కాస్త దూరం పడిపోయింది. ఈ క్రమంలోనే నాకు గాయాలయ్యాయి. ఈ ఘోర ప్రమాదంలో అసలు ఎలా బతికానో కూడా తెలియదు అని రమేష్ ప్రధాని మోదీ సహా తనను పలకరించిన వారికల్లా చెబుతున్నాడు. "ప్రమాదం జరిగాక నేను బతకడం కష్టమనే అనుకున్నా. అయితే నా సీటు దగ్గర్లో విమాన ప్రధాన భాగం ఉందని కనిపించింది. అక్కడ కొంచెం సందు కనిపించింది. నా సీటు బెల్ట్‌ను నెమ్మదిగా తొలగించి.. పాకుంటూ బయటకు వచ్చా. నా చుట్టుపక్కల వాళ్లలో కొందరు చనిపోయి ఉన్నారు. కొందరికి ఊపిరి ఆగిపోతున్న పరిస్థితి. అది చూశాక.. ఎలా తప్పించుకోవాలో నాకు అర్థం కాలేదు. బయటకు వచ్చాక.. విమానం పేలిపోయిందని ఏదో భాషలో(గుజరాతీ) అంతా అరుస్తున్నారు. ఆ గందరగోళ వాతావరణంలోనే నడుచుకుంటూ వచ్చి ఆంబులెన్స్ ఎక్కాను" అని రమేష్ తెలిపారు. ప్రస్తుతం కోలుకుంటున్న రమేష్‌ను.. త్వరలో పోలీసులు, దర్యాప్తు కమిటీ ప్రశ్నించే అవకాశం ఉంది.

# 'ఏపీలో శాంతి భద్రతలు క్షీణించాయి'

మొదటి పేజి తరువాయి

పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. 'అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాము. హరికృష్ణ పై దాడికి సంబంధించి జాతీయ మానవ హక్కుల సంఘం స్పందించి నివేదిక పంపాలని ఏపీ ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చింది. బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నాం. ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు చివాట్లు పెట్టింది. సాక్షి మీడియాను నిర్వీర్యం చేసేందుకు, ఏపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించారు. కొమ్మినేని శ్రీనివాస్ పై ఏపీ ప్రభుత్వం అక్రమంగా ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టింది. విశ్లేషకుడు చెప్పిన వ్యాఖ్యలకు కొమ్మినేనికి ఆపాదించడం సరికాదు కొమ్మినేనిని విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇది శుభపరిణామం' అని ఎంపీ గురుమూర్తి వ్యాఖ్యానించారు.

ఏపీలో మహిళలపై తీవ్రమైన అఘాయిత్యాలు

ఏపీలో మహిళలపై తీవ్రమైన అఘాయిత్యాలు జరుగుతున్నాయని అరకు ఎంపీ తనుజారాణి పేర్కొన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలలో చిన్న చిన్న బాలికలపై అత్యాచారాలు జరిగాయన్నారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎంపీ తనుజా రాణి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలను ఏపీ పోలీసులు టార్గెట్ చేస్తున్నారని, చిత్రహింసలకు గురిచేస్తున్నారన్నారు.


## ఆ ఒక్క ప్రయాణికుడు ఎలా తప్పించుకున్నాడో తెలుసా?

న్యూఢిల్లీ : అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో 265 మంది మరణించగా, ఒక్క ప్రయాణికుడు మాత్రం అద్భుతంగా ప్రాణాలతో బయటపడ్డారు. ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ171 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డ విశ్వాశ్ కుమార్ రమేశ్ తాను ఎలా రక్షించబడ్డాడో వివరించారు. విశ్వాశ్ కుమార్ విమానంలో 11ఏ నంబర్ సీటులో ఎడమవైపున ఉన్న అత్యవసర ద్వారం పక్కన కూర్చున్నారు. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానం గాల్లోనే ముక్కలైపోయిందని, తన సీటు విమానం నుంచి విడిపోయి దూరంగా ఎగిరిపడిందని ఆయన తెలిపారు. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమేశ్ వైద్యులతో మాట్లాడుతూ "విమానం ముక్కలైంది, నా సీటు ఊడివచ్చింది. అలా నేను ప్రాణాలతో బయటపడ్డాను" అని చెప్పారు. విమానం ఛిద్రమైనప్పుడు తాను సీటు బెల్టుతో ఉండగానే బయటకు విసిరివేయబడ్డానని, అంతేగానీ తాను దూకలేదని ఆయన స్పష్టం చేశారు. గాయాలతో బయటపడ్డ ఆయన ప్రస్తుతం ట్రామా వార్డులో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. లండన్‌లోని గాట్విక్ విమానాశ్రయానికి వెళ్లాల్సిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం, అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం మధ్యాహ్నం 1:39 గంటలకు టేకాఫ్ అయింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానం సమీపంలోని ఒక వైద్య కళాశాల హాస్టల్‌పై కుప్పకూలింది. ప్రమాద సమయంలో విమానంలో 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది ఉన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం విమానం టేకాఫ్ అయ్యాక కేవలం 600 నుంచి 800 అడుగుల ఎత్తుకు మాత్రమే చేరుకుని, వెంటనే కిందకు కూలిపోయింది. కూలిపోయే ముందు విమానం నుంచి భారీగా మంటలు, దట్టమైన నల్లటి పొగలు ఎగిసిపడటం చాలా దూరం నుంచి కనిపించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. టేకాఫ్ అయిన వెంటనే పైలట్ 'మేడే' (అత్యవసర పరిస్థితి) సందేశాన్ని అహ్మదాబాద్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు పంపినట్టు తెలిసింది. ఈ ఘటనపై అధికారిక దర్యాప్తు ప్రారంభమైంది. విమానం కూలిపోవడానికి గల కారణాలను తెలుసుకోవడానికి కీలకమైన బ్లాక్ బాక్స్ (ఫ్లైట్ డేటా రికార్డర్, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్) కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఎయిర్ ఇండియా వెల్లడించిన వివరాల ప్రకారం మృతి చెందిన ప్రయాణికుల్లో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటిష్ వారు, ఏడుగురు పోర్చుగీస్ వారు, ఒక కెనడియన్ ఉన్నారు. మిగిలిన 12 మందిలో ఇద్దరు పైలట్లు, 10 మంది విమాన సిబ్బంది ఉన్నారు. గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు విజయ్ రూపానీ కూడా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

## ట్యాపింగ్ కేసు.. వ్యూహం మార్చిన సిట్

హైదరాబాద్: సుదీర్ఘకాలం అమెరికాలో తలదాచుకున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు తిరిగి రావడం, ఆయన విచారణ పర్వం కొనసాగుతుండటంతో అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును సిట్ అధికారులు ముమ్మరం చేశారు. విచారణ అధికారులు అడుగుతున్న ప్రశ్నలకు ఆయన దాటవేత ధోరణిలో సమాధానాలు చెప్తుండటంతో తమ వ్యూహం మార్చారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయి, బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితులను మరోసారి ప్రశ్నించాలని నిర్ణయించారు. ఎస్ఐబీలోని ఎస్ఓటీకి నేతృత్వం వహించిన డి.ప్రణీత్‌రావు ఈ కేసులో అరెస్టు అయిన తొలి నిందితుడు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న ఈయన్ను బుధవారం ప్రభాకర్‌రావుతో కలిపి విచారించారు. తాజాగా శుక్రవారం సైతం విచారణ హాజరుకావాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. ప్రభాకర్‌రావు శనివారం మరోసారి సిట్ ఎదుట విచారణకు వస్తుండటంతో ఒక రోజు ముందు ప్రణీత్‌ను ప్రశ్నించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసుకు మూలం ఎస్ఐబీ కార్యాలయంలోని హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం చేయడం. ఎస్ఐబీ అదనపు ఎస్పీగా పని చేస్తున్న డి.రమేష్ ఫిర్యాదు ఆధారంగా కుట్ర, నమ్మక ద్రోహం, నేరపూరిత చర్యలు, ప్రజా ఆస్తుల విధ్వంసం తదితర సెక్షన్ల కింద నమోదైన ఈ కేసులో చాన్నాళ్ల తర్వాత టెలిగ్రాఫిక్ యాక్ట్ చేర్చారు. నల్లగొండ జిల్లాలో పని చేస్తూ, ఇన్‌స్పెక్టర్ హోదాలో 2018లో ఎస్ఐబీలోకి ప్రవేశించిన దుగ్యాల ప్రణీత్ రావుకు 2023లో డీఎస్పీగా యాక్సిలేటరీ పదోన్నతి లభించింది. ఈయన ఎస్ఐబీలో ఉన్న మిగిలిన అధికారుల మాదిరిగా కాకుండా విధులు నిర్వర్తించారు. ఎస్ఐబీ కార్యాలయంలో తన కోసం ప్రత్యేకంగా రెండు గదులను ఏర్పాటు చేసుకున్నారు. హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్ కూడా తీసుకు 17 అత్యాధునిక కంప్యూటర్లతో పని చేశారు. మావోయిస్టులు, ఉగ్రవాదులు, సంఘ విద్రోహక శక్తుల పేరుతో పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేశారనేది ప్రధాన ఆరోపణ. ప్రణీత్ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ నిఘాకు సంబంధించిన అనేక వివరాలను తన వ్యక్తిగత డ్రైవ్‌ల్లో భద్రపరుచుకున్నారని, 2023 డిసెంబర్ 4 రాత్రి ఎస్ఐబీ కార్యాలయంలోకి వచ్చిన ప్రణీత్ రావు అక్కడి సీసీ కెమెరాలు పని చేయకుండా ఆపేసి కంప్యూటర్లలో ఉన్న సమాచారాన్ని డిలీట్ చేయడంతో పాటు ఎస్ఐబీకి చెందిన 42 హార్డ్ డిస్క్‌లను ఎత్తుకెళ్లినట్లు అధికారులు గుర్తించారు. రెండు టీబీల డేటాను డిలీట్ చేయడంతో పాటు దాదాపు 1600 పేజీల కాల్ డేటాను కూడా ప్రణీత్ రావు తగులబెట్టినట్లు, కొన్ని హార్డ్ డిస్క్‌ల్ని ధ్వంసం చేయడంతో పాటు మరికొన్ని తీసుకుపోయి వాటి స్థానంలో కొత్తవి పెట్టినట్లు తేల్చారు. ప్రణీత్ రావు ఎస్ఐబీలో పని చేసినప్పుడు 30 మంది సిబ్బందితో ప్రత్యేక బృందం ఉంది. అప్పట్లో ఎస్ఐడీ చీఫ్‌గా ప్రభాకర్‌రావు ఉండటంతో ఆయనకు తెలిసే ఇదంతా జరిగిందని సిట్ అనుమానిస్తోంది. ఈ ఆరోపణల్లో అత్యధికం ప్రభాకర్‌రావు ఖండిస్తుండటంతో సిట్ అప్రమత్తమైంది. శుక్రవారం ప్రణీత్‌రావు నుంచి సేకరించే వివరాల ఆధారంగా శనివారం ప్రభాకర్‌రావుకు సంధించాల్సిన ప్రశ్నావళిని సిద్ధం చేయనున్నారని తెలిసింది. ప్రణీత్ తర్వాత భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావులకూ నోటీసులు జారీ చేసి ప్రశ్నించేందుకు సిట్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

## తెలంగాణ వ్యాప్తంగా వానలు... హైదరాబాద్‌లో రోడ్లపైకి నీరు, ట్రాఫిక్ కష్టాలు



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా విస్తరించడంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ విభాగం శుక్రవారం వెల్లడించింది. వాతావరణ శాఖ అధికారుల వివరాల ప్రకారం, రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో రాష్ట్రంలోని దక్షిణ, పశ్చిమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ఈరోజు ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్, నల్గొండ జిల్లాలతో పాటు వికారాబాద్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు, రుతుపవనాల ప్రభావంతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం వర్షం కురిసింది. బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్‌బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్‌నగర్, నారాయణగూడ, లక్డీకపూల్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో రోడ్లు నీటితో నిండిపోయాయి. దీంతో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# గురుకులాల్లోనూ డే స్కాలర్ చదువు అందిద్దాం



హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ... "కోరుకున్న విద్యార్థులందరికీ గురుకులాల్లో సీట్లు ఇవ్వలేం. అయితే, డే స్కాలర్లకు సైతం గురుకులాల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించవచ్చు. తర్వాత వారు ఇళ్లకు వెళ్లి కుటుంబంతో గడపొచ్చు. దీనిపై పరిశీలించండి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర విభాగాల కింద ఇంటర్ వరకు ఉన్న వివిధ విద్యాసంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలి. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న చోట కొత్తగా ప్రస్తుత ఏడాది నుంచే 571 ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభిస్తున్నాం.

ఆ స్థలాల్లో కొత్త పాఠశాలలు

రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా జరుగుతున్నందున పురపాలక శాఖతో సమన్వయం చేసుకొని కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయాలి. హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో సామాజిక వసతుల కోసం గుర్తించిన/వదిలేసిన స్థలాల్లో వాటిని ప్రారంభించండి. హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తే ప్రయోజనం ఉంటుంది. మనిషి జీవితంలో కుటుంబం, సమాజాల ప్రాధాన్యాన్ని, వాటిపై ఉండాల్సిన బాధ్యతను పిల్లలకు తెలిసేలా కౌన్సెలింగ్ ఇప్పిస్తే వారు బాధ్యతాయుత పౌరులుగా మారతారు" అని అభిప్రాయపడ్డారు. అద్దె చెల్లించని కారణంగా గురుకులాల భవనాలకు వాటి యజమానులు తాళాలు వేస్తున్న విషయం తనకెందుకు చెప్పలేదని అధికారులను సీఎం ప్రశ్నించినట్లు సమాచారం. సమీక్షకు కొందరు సరిగా సన్నద్ధమై రాలేదని ఆయన అసంతృప్తి వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎండీ గణపతిరెడ్డి... వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ భవనాల ఆకృతుల నమూనాలను చూపించగా... సీఎం రేవంత్‌రెడ్డి వాటికి కొన్ని మార్పులు సూచించినట్లు సమాచారం. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి, ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఆ చట్టం అమలుపైనా చర్చ!

విద్యా హక్కు చట్టంలోని 12(1)(సి) సెక్షన్‌ను అమలు చేస్తామని, దాని ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25% సీట్లను పేద విద్యార్థులకు కేటాయించేలా చూస్తామని, ఫీజులను తామే చెల్లిస్తామని ప్రభుత్వం ఇప్పటికే హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో సీఎం సమీక్షలో దానిపైనా చర్చించినట్లు సమాచారం. కర్ణాటక తరహాలో ప్రభుత్వ పాఠశాలలు లేనిచోట్ల మాత్రమే విద్యార్థులకు ప్రైవేట్‌లో చదువుకునే అవకాశం ఇవ్వడంపై ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలోనే కొత్తగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేస్తే... సమస్యే ఉండదని భావించి 571 పాఠశాలలను ప్రారంభించాలని నిర్ణయించినట్లు భావిస్తున్నారు.

## ఇది చంద్రబాబు నిరంకుశత్వానికి చెంపపెట్టు అన్న వైఎస్ జగన్




మొదటి పేజి తరువాయి

సుప్రీంకోర్టు ఆదేశాలు చంద్రబాబు గారికి పెద్ద చెంపపెట్టు. నిరంకుశంగా, అప్రజాస్వామికంగా, అరాచకంగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు న్యాయస్థానం గట్టిగా బుద్ధిచెప్పింది. ప్రాథమిక హక్కులకు, స్వేచ్ఛకు ఈ అరెస్టు తీవ్ర భంగకరమని కోర్టు చెప్పడం ముదావహం. అమరావతి నిర్మాణం పేరిట వేల కోట్ల అవినీతి నుంచి, తన పాలనా వైఫల్యాల నుంచి, క్షీణించిన లా అండ్ ఆర్డర్ పరిస్థితులపై తీవ్రంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించడానికి తన ఎల్లో మీడియాతో కలిసి చంద్రబాబుగారు కృత్రిమ వివాదాన్ని సృష్టించారు. అబద్ధాలు, మోసాలతో కూడిన పాలననుంచి మళ్లించడానికి, తాను చేయని వ్యాఖ్యలను కొమ్మినేని గారికి ఆపాదించి, దానిచుట్టూ తన ఎల్లో గ్యాంగ్‌ద్వారా పథకం ప్రకారం విషప్రచారం చేయించారు. వాటిని పట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా రౌడీయిజం చేశారు, ఆస్తులను ధ్వంసం చేశారు. మహిళల నిరసన పేరుతో ఒక ముసుగు వేసుకుని సాక్షి మీడియా యూనిట్ ఆఫీసులమీద, కార్యాలయాలమీద అరాచకంగా దాడులు చేయించారు. మీడియా స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని కాలరాశారు. చంద్రబాబుగారు తన తప్పును తెలుసుకోకుండా ఇంకా ఆ వ్యాఖ్యలను వైసీపీకి, సాక్షి మీడియాకు ఆపాదిస్తూ జుగుప్సాకరంగా మాట్లాడ్డంతోనే ఆయన రాజకీయ లబ్ధికోసం ఈ కుట్రపన్నారని అర్థం అవుతోంది. యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేని గారికి విశ్లేషకుడి వ్యాఖ్యలతో ఏం సంబంధం అంటూ? ఇవాళ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆర్డర్ చంద్రబాబు కుట్రను బద్దలు చేసింది, ఎండగట్టింది. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ అరెస్టుల అంశం మరోసారి దేశం దృష్టికి వెళ్లింది. వక్రీకరణలు, అబద్ధాలు ఎల్లకాలం చెల్లుబాటు కావు.... సత్యమేవ జయతే" అంటూ జగన్ పేర్కొన్నారు.

## గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ మృతి పట్ల పవన్ కల్యాణ్ సంతాపం


అమరావతి : గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత విజయ్ రూపానీ (68) నిన్న అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటన పట్ల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయ్ రూపానీ ఆకస్మిక మరణం పట్ల ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. రూపానీ కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. గుజరాత్ రాష్ట్రానికి, భారత రాజకీయ రంగానికి విజయ్ రూపానీ చేసిన సేవలను పవన్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు జనసేనాని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ పెట్టారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో ఇతర ప్రయాణీకులతో పాటు గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కూడా చనిపోవడం విషాదాకరం. ఆయన మృతికి నా హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఈ విషాదకరమైన సమయంలో ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, బీజేపీ కార్యకర్తలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను అని పవన్ ట్వీట్ చేశారు. కాగా, అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ 171 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే మేఘాని నగర్ సమీపంలోని నివాస ప్రాంతంలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న విజయ్ రూపానీతో సహా మొత్తం 241 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ వార్త దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాలను, ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. విజయ్ రూపానీ తన భార్య, కుమార్తెను కలిసేందుకు లండన్ వెళ్తుండగా ఈ విషాదం జరిగింది. వాస్తవానికి, బీజేపీ పంజాబ్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నందున, అలాగే ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనాల్సి రావడంతో ఆయన లండన్ ప్రయాణాన్ని గతంలో వాయిదా వేసుకున్నారు. ఆయన 2016 ఆగస్టు నుంచి 2021 సెప్టెంబర్ వరకు గుజరాత్ 16వ ముఖ్యమంత్రిగా సేవలందించారు. విమాన ప్రమాదంలో మరణించిన రెండో గుజరాత్ ముఖ్యమంత్రిగా రూపానీ నిలిచారు. గతంలో 1965లో బల్వంతరాయ్ మెహతా కూడా విమాన ప్రమాదంలోనే కన్నుమూశారు.

## విజయ్ భాయ్ ఇక లేరంటే నమ్మలేకపోతున్నాను: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ : గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత విజయ్ రూపానీ అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మరణించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విజయ్ రూపానీ కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా రూపానీతో తనకున్న దశాబ్దాల అనుబంధాన్ని, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆయనకున్న నిబద్ధతను మోదీ గుర్తుచేసుకున్నారు. "విజయ్‌భాయ్ రూపానీ కుటుంబాన్ని కలిసి నా సంతాపం తెలియజేశాను. విజయ్‌భాయ్ ఇక లేరనే వార్తను నేను అంగీకరించలేకపోతున్నాను. ఆయనతో నాకు సంవత్సరాల తరబడి అనుబంధం ఉంది. ఎన్నో క్లిష్ట సమయాల్లో మేమిద్దరం భుజం భుజం కలిపి పనిచేశాం" అని ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రూపానీ అత్యంత నిరాడంబరమైన, సౌమ్య స్వభావం కలిగిన వారని, కష్టపడి పనిచేసే తత్వం, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండేవారని ప్రధాని కొనియాడారు. పార్టీ సంస్థాగత బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూనే ఆయన గుజరాత్ ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని గుర్తు చేసుకున్నారు. రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసినా, రాజ్యసభ సభ్యుడిగా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా, కేబినెట్ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించినా, ప్రతి పాత్రలోనూ విజయ్ రూపానీ తనదైన ప్రత్యేక ముద్ర వేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "విజయ్‌భాయ్ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనతో కలిసి పనిచేసే అవకాశం నాకు లభించింది. గుజరాత్ అభివృద్ధి ప్రస్థానాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన ఎన్నో చర్యలు తీసుకున్నారు, అందులో 'ఈజ్ ఆఫ్ లివింగ్' (జీవన సౌలభ్యం) ఒకటి. ఆయనతో జరిగిన సమావేశాలు, చర్చలు ఎప్పటికీ గుర్తుంటాయి" అని ప్రధాని మోదీ తెలిపారు. విజయ్ రూపానీ గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణిస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే విమానం కుప్పకూలింది. ఈ విమానంలో ఇద్దరు పైలట్లు, 10 మంది సిబ్బందితో పాటు 230 మంది ప్రయాణికులు, మొత్తం 242 మంది ఉన్నారు. ఈ ప్రమాదంలో భారత సంతతికి చెందిన బ్రిటిష్ ప్రయాణికుడు విశ్వాస్ కుమార్ రమేశ్ ఒక్కరే ప్రాణాలతో బయటపడ్డారు. ప్రధాని మోదీ అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విశ్వాస్ కుమార్‌ను కూడా పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

## కుమారుడి అడ్మిషన్ కోసం పటాన్‌చెరు వెళ్లిన పవన్ కల్యాణ్



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ శుక్రవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో పర్యటించారు. ఇక్కడ ఉన్న ప్రఖ్యాత ఇక్రిశాట్ క్యాంపస్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ హైదరాబాద్ (ఐఎస్‌హెచ్)ను ఆయన సందర్శించడం చర్చనీయాంశంగా మారింది. తన కుమారుడు మార్క్ శంకర్ అడ్మిషన్ నిమిత్తమే పవన్ కల్యాణ్ ఈ పాఠశాలకు వెళ్లినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. కాగా, పాఠశాలలో అడ్మిషన్‌కు సంబంధించిన వివరాలను పవన్ అడిగి తెలుసుకున్నారని, అక్కడి సౌకర్యాలను కూడా పరిశీలించారని సమాచారం. ఇటీవల పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ సింగపూర్‌లోని పాఠశాలలో అగ్నిప్రమాదం బారినపడిన విషయం తెలిసిందే. ఈ సంఘటన నేపథ్యంలోనే, కుమారుడి చదువుల కోసం హైదరాబాద్‌లోని ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే పటాన్‌చెరులోని ఐఎస్‌హెచ్‌ను ఆయన సందర్శించి ఉంటారని భావిస్తున్నారు.

## ఫార్ములా-ఈ రేసు కేసు కేటీఆర్‌కు మళ్లీ ఏసీబీ నోటీసులు

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఫార్ములా-ఈ రేసు నిర్వహణ కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16వ తేదీ (సోమవారం) ఉదయం 10 గంటలకు తమ ఎదుట విచారణకు హాజరుకావాల్సిందిగా శుక్రవారం జారీ చేసిన నోటీసుల్లో ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. గతంలో మే నెల 28న విచారణకు రావాలని కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు పంపిన విషయం తెలిసిందే. అయితే, ఆ సమయంలో కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉండటంతో విచారణకు హాజరుకాలేకపోయారు. తన విదేశీ పర్యటన ముగిసిన అనంతరం విచారణకు అందుబాటులో ఉంటానని ఆయన ఏసీబీకి సమాచారం అందించారు. అంగీకరించిన ఏసీబీ, తాజాగా మరోమారు నోటీసులు జారీ చేసి విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ వేదికగా ఫార్ములా ఈ రేసును నిర్వహించారు. ఈ రేసు నిర్వహణలో సుమారు రూ.55 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపణలు రావడంతో ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా, అప్పటి మున్సిపల్ శాఖ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌ను ఏ2గా, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఏ3గా పేర్కొంటూ ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసుకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో కేటీఆర్‌తో పాటు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ అధికారులు వేర్వేరు తేదీల్లో విచారించి కొంత సమాచారాన్ని సేకరించారు. ఆ సమయంలోనే మరోసారి విచారణకు పిలిచే అవకాశం ఉందని వారికి చెప్పారు. వీరితో పాటు గ్రీన్‌కో ఏస్ నెక్స్‌జెన్ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌ను కూడా ఏసీబీ ప్రశ్నించింది. జనవరి విచారణ తర్వాత దాదాపు మూడు నెలల విరామం అనంతరం, ఇప్పుడు కేటీఆర్‌ను రెండోసారి విచారించాలని ఏసీబీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే తాజాగా నోటీసులు జారీ చేసి, సోమవారం విచారణకు హాజరు కావాలని స్పష్టం చేసింది.

## 28 గంటల్లో బ్లాక్ బాక్స్ స్వాధీనం చేసుకున్నాం

మొదటి పేజి తరువాయి

ఈ దుర్ఘటనలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీతో సహా మొత్తం 241 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ప్రమాద కారణాలను వెలికితీయడంలో ఈ బ్లాక్ బాక్స్ అత్యంత కీలకమైన ఆధారంగా మారనుంది. విమాన ప్రమాదాల దర్యాప్తు సంస్థ (ఏఏఐబీ) తెలిపిన వివరాల ప్రకారం, ఈ బ్లాక్ బాక్స్‌ను ప్రమాద స్థలానికి సమీపంలోని ఒక భవనం పైకప్పుపై కనుగొన్నారు. అహ్మదాబాద్‌లోని మేఘానినగర్ ప్రాంతంలో ఉన్న బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనం మెస్ సమీపంలో విమానం కూలిపోయిన సంగతి తెలిసిందే. "బ్లాక్ బాక్స్‌ను బిల్డింగ్ పైకప్పు మీద కనుగొన్నాం" అని ఏఏఐబీ అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా ధృవీకరించారు. ప్రమాదం జరిగిన 28 గంటల వ్యవధిలోనే ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) అధికారులు బ్లాక్ బాక్స్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారని మంత్రి తెలిపారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ప్రకటన చేశారు. ఈ బ్లాక్ బాక్స్ లభ్యం కావడం దర్యాప్తు ప్రక్రియలో చాలా ముఖ్యమైన ముందడుగు అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. "అహ్మదాబాద్‌లోని ప్రమాద స్థలం నుండి 28 గంటల్లోపు ఫ్లైట్ డేటా రికార్డర్ (బ్లాక్ బాక్స్)ను ఏఏఐబీ స్వాధీనం చేసుకుంది. ఇది దర్యాప్తులో ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ ఘటనపై విచారణకు ఇది గణనీయంగా సహాయపడుతుంది" అని మంత్రి తన పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఏఏఐబీ అధికారులు ఈ బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని డీకోడ్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ పూర్తయితే ప్రమాదానికి సంబంధించిన అనేక ప్రశ్నలకు సమాధానాలు లభించే అవకాశం ఉంది.

## పేర్ని నాని పాపం పండింది.. అవినీతి సొమ్ము కక్కిస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర

పేర్ని నాని పాపం పండిందని, గత ఐదేళ్లలో ఆయన దోచుకున్న అవినీతి సొమ్మును కక్కిస్తామని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఘాటుగా హెచ్చరించారు. దమ్ముంటే విచారణకు సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. "గత ఐదేళ్ల పాలనలో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి, బందరు నియోజకవర్గాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారు. ఇప్పుడు ఓటమి తర్వాత కూడా బుద్ధి రాలేదు. అరెస్ట్ భయంతో పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పేర్ని నాని ఒక బ్రోకర్‌లా వ్యవహరించారు" అని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు.

అక్రమాల చిట్టా విప్పుతామన్న మంత్రి!

పేర్ని నాని హయాంలో జరిగిన అక్రమాలను ఒక్కొక్కటిగా ప్రస్తావిస్తూ, వాటిపై త్వరలో పూర్తి ఆధారాలతో ప్రజల ముందుకొస్తామని మంత్రి తెలిపారు.

టిడ్కో ఇళ్ల నిర్లక్ష్యం: "పేదలపై నిజంగా ప్రేమ ఉంటే మచిలీపట్నంలో 6,400 టిడ్కో ఇళ్లను ఎందుకు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించలేదు? ఐదేళ్లలో వాటిని పట్టించుకోకుండా ఇప్పుడు కబుర్లు చెబుతున్నారు" అని నిలదీశారు. సీఆర్‌జెడ్ భూముల కేటాయింపులు: "2023లో బదిలీ అయిన తహసీల్దార్‌తో 2024లో ఎన్నికల ముందు సీఆర్‌జెడ్ భూముల్లో ఇళ్ల పట్టాలు ఎలా ఇప్పించారు? ఇది చట్టవిరుద్ధమని న్యాయస్థానాలు సైతం తప్పుబట్టాయి" అని కొల్లు రవీంద్ర గుర్తుచేశారు.

భూ సేకరణలో అవినీతి: "ఇళ్ల స్థలాల పేరుతో అధిక ధరలకు భూములు కొనుగోలు చేయించి, పేర్ని నాని, ఆయన అనుచరులు కమీషన్లు దండుకున్నారు. మచిలీపట్నం మెడికల్ కాలేజీ భూముల కొనుగోలు వ్యవహారంలో ఏకంగా రూ.8 కోట్ల మేర అవకతవకలు జరిగాయని కాగ్ నివేదిక కూడా స్పష్టం చేసింది. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తాం" అని హెచ్చరించారు. బియ్యం కుంభకోణం: "పేదలకు అందాల్సిన 8000 బియ్యం బస్తాలను స్వాహా చేసి, ఇప్పుడు బుకాయించడం సిగ్గుచేటు. దీనిపైనా చర్యలు తప్పవు" అని అన్నారు.

బందరు పోర్టుపై కుట్ర, కమీషన్ల దందా

బందరు పోర్టు విషయంలో పేర్ని నానిపై కొల్లు రవీంద్ర మరింత తీవ్ర ఆరోపణలు చేశారు. "2006లోనే బందరు పోర్టును అమ్మేసేందుకు పేర్ని నాని ప్రయత్నించారు. అప్పుడు ప్రజల పోరాటంతోనే బందరు పోర్టును సాధించుకున్నాం. మరి గత ఐదేళ్లలో ఈ పోర్టును ఎందుకు పూర్తి చేయలేకపోయారు? పోర్టు నిర్మాణ పనులను నత్తనడకన సాగించి, కమీషన్లు దండుకున్నారు. ఇప్పుడు ఓడిపోయాక పోర్టుపై ప్రేమ ఒలకబోస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. తమ కూటమి ప్రభుత్వం 2026 నాటికి బందరు పోర్టును పూర్తి చేసి చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బందరును పర్యాటక, క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. పోర్టు పూర్తయితే వేలాది మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.

## కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఏటూరు నాగారం మండల అధ్యక్షుడు. రఘు

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేత



ఏటూరు నాగారం (ప్రభాత సూర్యుడు): ఏటూరు నాగారం మండల కేంద్రంలో చిన్నబోయినపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభిమాన కార్యకర్త రవీందర్ ఇటీవలే చనిపోగా మంత్రి సీతక్క ఆదేశంతో



చిన్నబోయిన పల్లి వారి కుటుంబ సభ్యులను కలిసి 50%ఎస్త్ర% ల బియ్యం 5000 రూపాయల ఆర్థిక సాయం అందచేసిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ వారి కుంటుంబాని అన్ని రకాలుగా ఆదుకుంటామని వారి ఫ్యామిలీ కి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని.రఘు అన్నారు. కార్యకర్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని రఘు అన్నారు. ఈ కార్యక్రమంలో ఖలీల్ ఎస్టీ సేల్ మండల అధ్యక్షుడు వినయ్ ఎండి గౌస్ సొసైటీ డైరెక్టర్ వంగపండ్ల రవి శాపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రాములు అనిల్ ప్రకాష్ సత్యనారాయణ ఆలం నాగార్జున మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

## ఇందిరమ్మ లబ్ధిదారులకు అవగాహన సదస్సు




ఏటూరు నాగారం (ప్రభాత సూర్యుడు): ఏటూరు నాగారం మండల కేంద్రంలో అన్ని గ్రామాల ఇందిరమ్మ లబ్ధిదారులకు అవగాహన సదస్సు ఏటూరు నాగారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించిన ఎంపిడిఓ రాజ్యలక్ష్మి ఇందిరమ్మ ఇళ్లు ఎంత స్థలములో నిర్మించాలి ఎన్ని గదులు లతో నిర్మించాలి అనే దానిపై ఏటూరు నాగారం మండలం అన్ని గ్రామాల లబ్ధిదారులతో సదస్సు నిర్వహించారు సకాలములో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని సహాయక ఇంజనీర్ తెలిపారు. ఈ సదస్సు కు పంచాయతీ కార్యదర్శి లు ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారులు హాజరయ్యారు

## రాష్ట్రంలో ప్రతి పేదవానికి సొంత ఇంటి కాలని నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు.రఘు



ఏటూరు నాగారం (ప్రభాత సూర్యుడు): ఏటూరు నాగారం మండలం కేంద్రములో.విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదవాడికి సొంత ఇంటి కల నిజమవుతుందని అన్నారు. ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇది మొదటి విడత జాబితా మాత్రమేనని రెండో విడత జాబితాలో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు వస్తుందని అన్నారు. ఇందిరమ్మ ల గురించి ప్రజలందరూ ఇటువంటి పైరవీలు తావు లేకుండా మంత్రి సీతక్క ప్రతి పేదవాడికి గుర్తించి ఇల్లు మంజూరు చేస్తుందన్నారు. ఈరోజు ఇందిరమ్మ అవగాహన సదస్సు హాజరైన మండలం అధ్యక్షుడు సకాలంలో సహాయక ఇంజనీర్ ఇచ్చిన ఎస్టిమేషన్ ప్రకారమే ఇల్లు కట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు.. పలు జిల్లాల్లో ఘర్షణలు

ఇంఫాల్ : మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. పలు జిల్లాల్లో భద్రతాదళాలకు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చెలరేగాయని మంగళవారం పోలీస్ అధికారులు తెలిపారు. మైతీ తెగకు చెందిన స్వచ్ఛంద సంస్థ అరంబై తెంగల్ (ఎటి) నేత కనన్ సింగ్ సహా అరెస్ట్ చేసిన మరో నలుగురిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు గత రెండు రోజుల నుండి ఆందోళనలు చేపడుతున్న సంగతి తెలిసిందే. వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖురై లామ్లాంగ్ ప్రాంతంలో ఘర్షణలు చెలరేగాయి. నిరసనకారులను చెదరగొట్టేందుకు భద్రతా దళాలు టియర్‌గ్యాస్, రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించారు. ఈ ఘటనలో నిరసనకారులు ఒక వాహనాన్ని తగులబెట్టారని పోలీసులు తెలిపారు. తౌబాల్ మరియు కాక్చింగ్ జిల్లాల్లో రహదారులను దిగ్బంధించారని, టైర్లు తగలబెట్టారని అన్నారు. ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని తేరా ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు భద్రతాదళాలపై ఏడు రౌండ్లు కాల్పులు జరిపడంతో ఉద్రిక్తతలు చెలరేగాయని అన్నారు. నిందితుల కోసం పారామిలటరీ దళాలు గాలింపు చర్యలు చేపట్టాయని అన్నారు. బిష్ణుపూర్‌జిల్లాలోని నంబోల్‌లో నిరసనకారులతో జరిగిన ఘర్షణలో ఇద్దరు పోలీస్ సిబ్బందికి స్వల్పగాయాలయ్యాయని, ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అన్నారు.

## ఢిల్లీకి సీఎం సిద్ధరామయ్య.. బెంగళూరు తొక్కిసలాటపై చర్చ?




న్యూఢిల్లీ: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ న్యూఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్‌ను కలవనున్నారు. జూన్ 4న బెంగళూరులో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందిన ఘటనపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం చర్చించనున్నారని సమాచారం. ఈ తొక్కిసలాట ఘటన దరిమిలా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలకు గురైంది. ఈ ఘటనకు సీఎం, డిప్యూటీ సీఎం ఇద్దరూ ప్రత్యక్షంగా బాధ్యులని ఆరోపిస్తూ, వారు రాజీనామా చేయాలని కోరుతూ ప్రతిపక్ష బీజేపీ, జేడీ(ఎస్)లు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్‌ను కలుసుకోనున్న సిద్ధరామయ్య, డీకేఎస్‌లు ఆర్‌సీబీ విజయోత్సవ ఘటన తొక్కిసలాట పూర్వాపరాలపై సమగ్రంగా చర్చించనున్నారు. 'సిద్ధరామయ్య ఢిల్లీలో పార్టీ నాయకత్వాన్ని కలుస్తారు. రాష్ట్రంలోని తాజా పరిణామాలపై వారికి వివరిస్తారు' అని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవలే గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) అధికారులతోపాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం నేడు తిరిగి ఢిల్లీకి వెళుతున్నారు. జూన్ నాలుగున సాయంత్రం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో 11మంది మృతి చెందారు. ఆర్సీబీ జట్టు విజయోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. నాటి తొక్కిసలాట ఘటనలో 56 మంది గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి కాంగ్రెస్ హైకమాండ్ తన నుండి సమాచారం కోరిందనే వార్తలను సిద్ధరామయ్య తోసిపుచ్చారు. కాగా నేటి అధిష్టానం భేటీలో గవర్నర్ ఎంపిక నామినేషన్ల కోసం సిఫార్సు చేసిన నాలుగు పేర్లు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

# ఘర్షణల మధ్య చిక్కుకొని విలవిలలాడుతున్న ఈశాన్య రాష్ట్రం



తుపాను ముందర ప్రశాంతత అంటే ఇదేనేమో! కొద్దివారాలుగా మణిపుర్ కొంత ప్రశాంతంగా ఉందని భ్రమిస్తున్నంత సేపు పట్టలేదు... ఆ రాష్ట్రం మరోసారి భగ్గుమంది. గత రెండేళ్ళుగా జాతి ఘర్షణల మధ్య చిక్కుకొని విలవిలలాడుతున్న ఈశాన్య రాష్ట్రం మళ్ళీ పతాక శీర్షికలకు ఎక్కింది. 2023 అల్లర్ల వేళ అనేక నేరాలకు పాల్పడినట్టు ఆరోపణలను ఎదుర్కొంటున్న మైతేయ్‌ల ర్యాడికల్ సంస్థ 'అరంబై తెంగోల్' (ఏటీ) నేత కనాన్ సింగ్‌ను సీబీఐ అరెస్ట్ చేయడంతో ఆదివారం ఉద్రిక్తత పెచ్చరిల్లింది. భగ్గుమన్న నిరసనల మధ్య రాష్ట్రంలో పలుచోట్ల కర్ఫ్యూ, అయిదు రోజుల పాటు ఇంటర్నెట్‌పై నిషేధం విధించాల్సి వచ్చింది. వివిధ పార్టీల ఎమ్మెల్యేలు 23 మంది ఆదివారం వెళ్ళి, గవర్నర్‌ను కలసి పరిస్థితిని వివరించి, సామరస్యపూర్వక పరిష్కారానికై అర్థించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వెరసి, కేంద్రం సుదీర్ఘ జాప్యం తర్వాత ఫిబ్రవరిలో ఎట్టకేలకు అసమర్థ బీరేన్ సింగ్ సర్కార్‌ను తప్పించి రాష్ట్రపతి పాలన విధించిందన్న మాటే గానీ, మణిపుర్‌ను యథాపూర్వ స్థితికి తీసుకురాలేకపోయింది. తాజా పరిణామాలే అందుకు నిలువెత్తు నిదర్శనం. మైతేయ్‌లకు ఎస్టీ హోదాను ఇవ్వడాన్ని కుకీ వర్గ ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకించడం రెండేళ్ళ క్రితం జాతుల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీసింది. ఆర్థిక ప్రయోజనాలు, భూయాజమాన్యంపై అసలే దీర్ఘకాలంగా రెండు వర్గాల మధ్య నెలకొన్న అసంతృప్తి ఆ తాజా పరిణామంతో మరింత చిచ్చు రేపింది. అలా 2023 మే 3 నుంచి రాష్ట్రం అక్షరాలా తగలబడుతూనే ఉంది. ఈ ఘర్షణల వల్ల 270 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. బీరేన్ సింగ్ సారథ్యంలోని అప్పటి బీజేపీ ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల రీత్యా ఒక వర్గానికి కొమ్ము కాస్తూ, పక్షపాతధోరణితో వ్యవహరించినట్టు ఆది నుంచీ ఆరోపణలున్నాయి. చివరకు భద్రతా దళాలు సైతం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడినట్టు వార్తలొచ్చినసంగతి మర్చిపోలేం. ప్రజలు, ప్రతిపక్షాల నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా, బీరేన్‌ను మార్చడానికి ఇష్టపడని బీజేపీ అధిష్ఠానం తీరా గత ఫిబ్రవరిలో ఆయనను పక్కకు తప్పించినా పుణ్యకాలం గడిచిపోయింది. 2022 ఫిబ్రవరి నాటి ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ మద్దతు కూడగట్టుకొని అధికారం చేపట్టినా, పట్టుమని పదిహేను నెలలకే రాష్ట్రంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. మొత్తం 60 మంది సభ్యు లున్న మణిపుర్ అసెంబ్లీలో నిజానికి బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలున్నారు. రాష్ట్రం అతలాకుతల మవుతున్న వేళ... బీరేన్ స్థానంలో అన్ని వర్గాలకూ అనుకూలుడైన కొత్త వ్యక్తిని సీఎం కుర్చీలో కూర్చోబెట్టి, రాష్ట్రపతి పాలనను నివారించి ఉండవచ్చు. కానీ, సీఎం అభ్యర్థిపై సొంత పార్టీలోనే ఏకాభిప్రాయం కుదరలేదు. పైగా, కుకీ-జో వర్గానికి చెందిన పార్టీ ఎమ్మెల్యేలు ఏడుగురు ఘర్షణలు మొదలైన నాటి నుంచి సభకు దూరంగా ఉండడం ఆ పార్టీకి తలనొప్పిగా తయారైంది. చివరకు, ఘర్షణలు మొదలైన 21 నెలల తర్వాత రాష్ట్రపతి పాలనే శరణ్యమైంది. కానీ, అప్పటికే చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టయింది. ఈశాన్య భారత అభివృద్ధికి తామే బాటలు వేస్తున్నామంటున్న పాలక పార్టీ మణిపుర్ వ్యవహారాన్ని సరైన రీతిలో చక్కదిద్దలేకపోయిందన్న శాశ్వత అప్రతిష్ఠను మూటగట్టుకోవాల్సి వచ్చింది. రాష్ట్రపతి పాలన విధించినా, పర్వత ప్రాంత రాష్ట్రంలో పరిస్థితి నేటికీ నివురు గప్పిన నిప్పులానే ఉందని శని, ఆదివారం నాటి ఘటనలు మరోమారు ఋజువు చేశాయి. అక్కడి ఉద్రిక్తతను ప్రపంచానికి నివేదిస్తున్న విలేఖరులు సైతం శనివారం భద్రతా బలగాల దాడికి గురయ్యారు. పాత్రికేయులపై రాష్ట్రంలో పదే పదే జరుగుతున్న దాడులకు నిరసనగా చివరకు సోమవారం మణిపుర్‌లోని ప్రధాన పత్రికలన్నీ తమ పేపర్‌లో సంపాదకీయ స్థానాన్ని ఖాళీగా వదిలేశాయి. పత్రికలన్నీ సమష్టిగా నిలిచి ఇలా అరుదైన రీతిలో తమ నిరసన తెలియ జేయడం ఓ బలమైన సందేశం. మణిపుర్‌లో ఇప్పటికీ మామూలు పరిస్థితులు లేవనడానికి ప్రతీక. అసలు రెండేళ్ళ క్రితం ఘర్షణలు చెలరేగగానే ఆ ఏడాది జూన్ 4న కేంద్రం ముగ్గురు సభ్యుల విచారణ సంఘం వేసింది. పదే పదే పొడిగింపుల ప్రహసనంతో సదరు సంఘం కాలపరిమితి ఈ ఏడాది నవంబర్ దాకా దేకింది. అప్పటికైనా ఆ సంఘం కొత్తగా తేల్చేదేమిటో, దాని నివేదికతో ఒరిగేదేమిటో చెప్పలేం. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ కుప్పకూలిందని 2023 ఆగస్టులో సుప్రీమ్ కోర్ట్ వ్యాఖ్యానించినా మన ఏలికలకు చీమ కుట్టినట్టయినా లేదు. నష్టనివారణలో చిత్తశుద్ధి కరవైంది. రాష్ట్రపతి పాలనతో పరిస్థితి మెరుగువతుందనుకుంటే అడియాసైంది. గవర్నర్ సైతం ఇంఫాల్ విమానాశ్రయం నుంచి ఇంటికి హెలికాప్టర్‌లో వెళ్ళాల్సిరావడం దిగ్భ్రాంతికరం. సాక్షాత్తూ బీజేపీ ఎంపీ ఒకరు 2020లో స్థాపించిన 'ఏటీ' సాయుధ పౌరసైన్యంగా మారి హింసకు పాల్పడి, ఆయు ధాలను కొల్లగొట్టినట్టు కథనం. ఎవరెన్నిమార్లు అభ్యర్థించినా, ఇప్పటికీ ఆయుధాలను అప్పగించ లేదు. రేపు అవి మరే నేరగాళ్ళ చేతిలో పడి, ఎక్కడకు దారి తీస్తాయో ఊహించలేం. గతంలో పలు తీవ్రవాద వర్గాలు నిషేధానికి గురైనా, ఇప్పటికీ ఏటీని ఎందుకు నిషేధించలేదంటే జవాబూ లేదు. ఇంత జరుగుతున్నా ప్రధాని పెదవి విప్పకపోవడం, ప్రపంచమంతా తిరుగుతున్నా ఈశాన్యంలో పర్యటించి భరోసా ఇవ్వకపోవడం సమర్థించలేం. ఇప్పటికైనా తీవ్రతను గుర్తించి, విభిన్న వర్గాల మధ్య సామరస్యానికి కృషి చేయాలి. హింస కన్నా అభివృద్ధి ముఖ్యమని నచ్చజెప్పాలి. వేలాది సగటు మణిపురీలు అనేక నెలలుగా శరణార్థి శిబిరాల్లో తలదాచుకోవాల్సి రావడం అన్ని పార్టీల సమష్టివైఫల్యం. ఇది ఇలాగే కొనసాగితే మానవత్వానికే మాయనిమచ్చ. దేశసమగ్రతకే ప్రమాదం.

# ప్రజాస్వామ్యానికి ప్రమాదం




కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పదకొండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అట్టహాసపు సంబరాలు, ప్రచారార్భాటం సాగిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ జమ్మూకాశ్మీర్ రియాసిలో చినాబ్ రైల్వే వంతెనను ప్రారంభిస్తూ దేశ అభివృద్ధికి ప్రతీకగా జాతీయ జెండా పట్టుకొని మరీ వక్కాణించారు. బిజెపి శ్రేణులు ఊరూ వాడా వికసిత భారత్ పొలి కేకలు లంకించుకున్నాయి. బిజెపి 2014లో అధికారపీఠమెక్కగా ఈ పదకొండేళ్లల్లో దేశ సగటు మనిషి బతుకు ఎంత మెరుగ్గా ఉందనే ప్రశ్న తలెత్తుతుంది. మోడీ పాలనలోకొచ్చినప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో పదవ స్థానంలో ఉండగా మూడవ స్థానానికి చేరేందుకు దూసుకెళుతున్నామంటోంది బిజెపి. వాస్తవంగా ఆ పరిస్థితి ఉందా? వార్షిక వృద్ధి రేటు కొన్నేళ్లపాటు పది శాతం ఉండాలి. గతేడాది 6.5 శాతం కూడా లేదు. ఇంకా తక్కువేనని రేటింగ్ సంస్థలు చెబుతున్నాయి. కోవిడ్ అనంతరం పుంజుకోవాల్సిన వృద్ధి అప్పటికంటే దిగజారింది. అలాంటప్పుడు మూడవ ఆర్థిక వ్యవస్థ ఎలా సాధ్యం? జనాభాలో చైనాను భారత్ దాటిపోయింది. ప్రపంచబ్యాంక్ తన పేదరిక కొలమానాలను సర్దుబాటు చేసుకున్నాక కూడా మన దేశంలో 40 కోట్ల మంది పేద, మధ్యస్త ఆదాయం కలిగిన వారున్నారని అంచనా వేసింది. ఇప్పటికీ ప్రభుత్వం 80 కోట్ల మందికి ఆహార భద్రతా చట్టం కింద సబ్సిడీపై ఆహార ధాన్యాలు అందిస్తోంది. అయినా ఆకలి సూచిలో మన దేశం చిట్టచివరన కునారిల్లుతోంది. ప్రజల తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు మెరుగు కాకుండా నిజమైన వికసిత భారత్ అసాధ్యం. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను భుజానికెత్తుకున్న ఫలితంగా ఆర్థిక అసమానతలు ఆందోళనకర స్థాయికి చేరాయని ఈ కాలంలో శతకోటీశ్వరుల సంఖ్య, వారి చేతుల్లో పోగుపడిన సంపదే తెలుపుతుంది. 2022-23 ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం దేశంలో ఒక శాతం సంపన్నుల వద్ద 22.6 శాతం ఆదాయాలు, 40.1 శాతం జాతి సంపద కేంద్రీకృతమైంది. ఫోర్బ్స్ జాబితాలో 2014 నాటికి భారతీయ శతకోటీశ్వర్లు వంద మంది ఉంటే, 2024 నాటికి ఆ సంఖ్య 200కి చేరుకుంది. ప్రపంచంలోనే తీవ్ర ఆర్థిక అసమానతలు కలిగిన దేశంగా మోడీ జమానాలో ఖ్యాతికెక్కింది! కార్పొరేట్ల దోపిడీకి ప్రభుత్వం అన్ని విధాలా పని చేస్తున్నందునే వారి సంపద పోగుబడుతోంది. కార్మిక చట్టాల రద్దు, దొడ్డిదారిన నల్ల వ్యవసాయ చట్టాలు, భూములు, అటవీ, సహజవనరుల ధారాదత్తం, బ్యాంకు రుణాల రద్దు, పన్ను రాయితీలు, అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు దోచిపెడతాయి. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి తదితరాలు ప్రజలపై మోడీ ప్రభుత్వం సాగించిన దుర్మార్గపు దాడులు. నిత్యావసరాలు సహా అన్నింటి ధరలూ పెరిగాయి. పారిశ్రామిక, తయారీ రంగాలు కుదేలయ్యాయి. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. నిరుద్యోగం కొత్త రికార్డులు బద్దలు కొడుతోంది. వ్యవసాయ సంక్షోభానికి సంకేతం లక్ష మంది రైతుల, వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు. ఇదీ బిజెపి పాలన సాధించిన ఘనత! ఈ కాలంలో హిందూ మతోన్మాద చర్యలకు కొదవే లేదు. జమ్మూకాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే 370 ఆర్టికల్ రద్దు, సిఎఎ, బిజెపి రాష్ట్రాల్లో ఏకరూప పౌరస్మృతి, అయోధ్యలో రామాలయ నిర్మాణం, గోరక్షణ పేరిట మూకదాడులు, మసీదుల కింద ఆలయాల అన్వేషణకు సర్వేలు, మత క్రతువుల పేరిట అల్లర్లు చెప్పుకుంటూ పోతే సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో బిజెపి మద్దతుతో ముస్లిం మైనార్టీలు, క్రైస్తవుల లక్ష్యంగానే ఇవన్నీ సాగాయి. తెగల మధ్య ఘర్షణలతో మణిపూర్ రగులుతూనే ఉంది. సనాతనధర్మం పేరిట దళితులు, ఆదివాసీలు, మహిళలు, ఇతర అణగారిన తరగతులపై దాడులు ఉండనే ఉన్నాయి. రాష్ట్రాల హక్కులను హరించే, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసే కుట్రలు, ప్రణాళికా సంఘం రద్దు, ఎన్నికైన ప్రభుత్వాలపై గవర్నర్ల వేధింపులు నిత్యం చూస్తున్నాం. ప్రతిపక్షాలపై సిబిఐ, ఇడి ప్రయోగం, అక్రమ కేసులు, అరెస్టులకు హద్దుపద్దు లేదు. న్యాయ వ్యవస్థ, ఎన్నికల కమిషన్‌లను బలహీనపర్చే చర్యలు, చివరికి పార్లమెంట్‌ను సైతం హైజాక్ చేస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా పరిణమించాయి. బిజెపి పాలనలో రాజ్యాంగ మౌలిక స్వరూపానికి, పునాదులపై ఉద్దేశపూర్వక దాడి ఎక్కుపెట్టబడింది. దేశంలో నయా ఫాసిస్టు ధోరణులు వ్యక్తమవుతున్నాయి. లౌకిక, ప్రజాస్వామిక వాదులు, ప్రజలు అప్రమత్తం కావాల్సిన సమయం.

# సందేహాస్పద బనకచర్ల




రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఆకాశమే హద్దుగా హైప్ ఇచ్చి తలకెత్తుకున్న గోదావరి-బనకచర్ల భారీ నీటి పారుదల ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై ఆదిలోనే సందేహాలు చుట్టుముట్టాయి. రూ.81 వేల కోట్ల వ్యయం కాగల ఈ 'బాహుబలి' ప్రాజెక్టును స్వీయ ఆర్థిక (సెల్ఫ్ ఫైనాన్స్) ప్రాజెక్టుగా కేంద్ర ఆర్థిక శాఖ వద్ద రెండు రోజుల క్రితం జరిగిన సమావేశంలో రాష్ట్ర అధికారులు పేర్కొన్నట్లు వార్తలొచ్చాయి. సెల్ఫ్ ఫైనాన్స్ అంటే ఏమిటి? ఎలా అమలు చేస్తారు? ప్రజలపై ఏమైనా భారాలు మోదుతారా? అనే విషయాలను ప్రభుత్వం బహిర్గతం చేస్తేనే ఎవ్వరికైనా అవగతమవుతుంది. వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. గత డిసెంబర్‌లో బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తెచ్చిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రైవేటు కంపెనీలను భాగస్వామ్యం చేస్తామన్నారు. మొన్న కేంద్రం వద్ద జరిగిన సమావేశంలో నిధుల సమీకరణపై మన అధికారులు ఇచ్చిన ప్రజంటేషన్‌లో కేంద్ర సాయం, రాష్ట్రం నిధులు, కొంత అప్పు, యాన్యుటీ నమూనాలో పని చేసే కాంట్రాక్టర్లు కొంత వెచ్చిస్తారని చూచాయగా చెప్పారు. పూర్తి నిధులు కేంద్రాన్ని అడగకుండా అప్పులు, కాంట్రాక్టర్ల నుంచి డబ్బు సమీకరిస్తామనడంతోనే ప్రైవేటు ప్రాజెక్టుగా అనిపిస్తుంది. అదే అయితే నీటి వినియోగదారులపై పన్నుల బాదుడు అనివార్యం. పోలవరం నుంచి 200 టిఎంసి గోదావరి వరద నీటిని కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్ తరలించే గోదావరి-కృష్ణా-పెన్నా నదులను అనుసంధానం చేసే ప్రాజెక్టు వలన వెనకబడిన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 80 లక్షల మంది తాగునీటి అవసరాలకు, కొత్తగా ఏడున్నర లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందంటోంది ప్రభుత్వం. ఆ లక్ష్యం నెరవేరితే మంచిదే. ప్రభుత్వ చిత్తశుద్ధి, ఆచరణపైనే అనుమానం. ఇప్పటికే ఉన్న పోలవరం అనుభవం ప్రభుత్వ కార్యదక్షతను వెక్కిరిస్తోంది. రాష్ట్ర విభజన చట్టంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా పేర్కొనగా దశాబ్దం దాటినా అతీగతీ లేదు. ఈ కాలమంతా కేంద్రంలో బిజెపి ప్రభుత్వమే అధికారంలో ఉంది. నిర్వాసితుల బాధ్యత తమది కాదని తప్పించుకుంటోంది. తమది కూటమి ప్రభుత్వమని, డబుల్ ఇంజన్ సర్కార్ అని అటు బిజెపి ఇటు టిడిపి, జనసేన చెప్పుకుంటున్నా పోలవరంపై అగమ్యగోచరమే. రూ.15 వేల కోట్ల అంచనాతో మొదలైన పోలవరం ఇప్పుడు 55 వేల కోట్లకు చేరుకుంది. భవిష్యత్తేమిటో తెలీదు. ఈ పూర్వరంగంలో డిపిఆర్, ప్రీ ఫీజిబిలిటీ నివేదికలు సైతం లేని బనకచర్ల పరిస్థితిని ఊహించడం కష్టం. కేంద్రాన్ని నిధులడగకుండా బనకచర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు యోచన అప్పుల కోసమే. అప్పులిచ్చే వారు ప్రాజెక్టుపై ఎంత రిటర్న్ వస్తాయో తెలుసుకున్నాకనే రుణాలిస్తారు. ప్రజలపై పన్నులేస్తేనే ఆదాయం వస్తుంది. ఆంధ్రప్రదేశ్‌కు వ్యవసాయమే ఆధారం. సాగునీటి ప్రాజెక్టులతోనే సాగుకు గ్యారంటీ. రాష్ట్రంలో సాగయ్యే భూమిలో అన్ని నీటి వనరులూ కలుపుకున్నా 40 శాతం విస్తీర్ణానికే సాగునీటి వసతి ఉంది. ప్రభుత్వాలు కనబరిచిన చిన్ననీటి వనరుల నిర్లక్ష్యం వలన వాటి పరిధిలో అంతకంతకూ సాగు తగ్గుతోంది. ప్రాజెక్టులు కడుతున్నామని ఏలికలు ప్రచారం చేసుకుంటుండగా కాల్వల కింద సాగు పెరిగింది లేదు. క్రమేపి తగ్గుతోంది. రాష్ట్ర విభజన జరిగిన 2014లో కాల్వల కింద సాగు 18.82 లక్షల హెక్టార్లు కాగా నేడు 13.24 లక్షల హెక్టార్లకు క్షీణించింది. టిడిపి, వైసిపి రెండు ప్రభుత్వాల్లోనూ క్షీణత కొనసాగింది. బనకచర్ల వంటి బాహుబలి స్కీంలను చూపించి ఇతర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తారన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. వెనుకబడ్డ రాయలసీమ, ఇతర కరువు పీడిత ప్రాంతాల్లో ప్రాధాన్యత కలిగి ఇప్పటికే చేపట్టిన తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వెలుగొండ ఇత్యాది ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి పూర్తి చేయాలన్న డిమాండ్ సహేతుకమైనది. ప్రతిపాదిత బనకచర్ల వలన ఆయా ప్రాజెక్టులకు కృష్ణా ట్రిబ్యునల్స్ ద్వారా ఉమ్మడి రాష్ట్రంలో కల్పించిన హక్కులకు భంగం వాటిల్లుతుందన్న ఆవేదనకు ప్రభుత్వం నుంచి సమాధానం లేదు. తెలంగాణ ప్రభుత్వం బనకచర్లను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం నేల విడిచి సాము చేసే విన్యాసాలను విడనాడి రాష్ట్ర, వెనకబడ్డ ప్రాంతాల ప్రజల ప్రయోజనాలకు కట్టుబడాలి. ఆ దిశగా ప్రజలే ప్రభుత్వాన్ని కదిలించాలి.



PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## సింధూర్ ఆపరేషన్‌తో పహల్గాం బాధితులకు న్యాయం




న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడి బాధితులకు, వారికుటుంబాలకు న్యాయం చేసేందుకు ఆపరేషన్ సింధూర్ చేపట్టినట్లు వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ పేర్కొన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మొత్తం తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా దాడి జరిపామని అన్నారు. పౌరులకు, మౌలిక సదుపాయాలకు ఎటువంటి నష్టం జరగకుండా ఆ ప్రదేశాలను ఎంచుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషీలు కూడా పాల్గొన్నారు. ఉగ్రవాద శిబిరాలపై దాడి వీడియోలను కల్నల్ సోఫియా ఖురేషీ మీడియాకు విడుదల చేశారు. 2008 ముంబయి ఉగ్రదాడులకు పాల్పడిన డేవిడ్ హెడ్లీ, అజ్మల్ కసబ్ శిక్షణ పొందిన మురుద్కే నగరం కూడా ఉంది. మురుద్కేలతో పాటు సియాల్ కోట్‌లోని సర్జల్ క్యాంప్, బర్నాలా మరియు మర్కజ్ అబ్బాస్‌లోని మర్కజ్ అహ్లె హదీత్, కొట్లి, మెహమూనా జోయాల శిబిరాలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకున్నట్లు కల్నల్ తెలిపారు. జమ్ముకాశ్మీర్‌లో శాంతియుత వాతావరణాన్ని తిరిగి దెబ్బతీసే లక్ష్యంతో పహల్గాంపై దాడి జరిగిందని విదేశాంగ కార్యదర్శి తెలిపారు. పహల్గాం దాడి అత్యంత క్రూరమైనదని, బాధితులలో ఎక్కువ మందిని చాలా దగ్గరగా, వారి కుటుంబసభ్యుల ఎదుట తలపై కాల్చిచంపారు. ఉద్దేశపూర్వక హత్యతో కుటుంబసభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. కాశ్మీర్‌లో సాధారణ స్థితిని తిరిగి దెబ్బతీయడమే లక్ష్యమని అన్నారు. భారత నిఘా సంస్థలు ఉగ్రవాద కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నాయని అన్నారు. భారత్‌లో మరిన్ని దాడులు జరగనున్నాయని నిఘావర్గాలు సూచించాయని, దీంతో సరిహద్దు ఉగ్రవాదాన్ని అడ్డుకునేందుకు భారత్ ప్రతిస్పందించే హక్కును వినియోగించుకుందని విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. దాడులు తీవ్ర తరం కావని, దామాషా మరియు బాధ్యతాయుతంగా ఉన్నాయని అన్నారు. ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలను కూల్చివేయడంపై దృష్టిసారించామని అన్నారు.

## ఆపరేషన్ సింధూర్‌పై స్పందనలు




ఢిల్లీ: పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై బుధవారం తెల్లవారుజామున ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్‌పై దేశీయంగా పలువురి నుండి స్పందనలు వెల్లువెత్తుతున్నాయి. పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద వనరులన్నింటినీ నిర్మూలించడానికి భారతదేశం యొక్క నిబద్ధత రాజీలేనిదిగా ఉండాలని, ఎల్లప్పుడూ అత్యున్నత జాతీయ ప్రయోజనాలకు కట్టుబడి ఉండాలని కాంగ్రెస్ పేర్కొంది. భారత సైన్యానికి తమిళనాడు అండగా నిలుస్తుంది : ఎంకే స్టాలిన్, తమిళనాడు సీఎం పహల్గామ్ ఉగ్రవాద దాడిపై ప్రతీకారం తీర్చుకున్న భారత సాయుధ దళాలకు వందనం. వారి అసమాన ధైర్యంతో మన దేశం ఉక్కు సంకల్పంతో తనను తాను రక్షించుకుంటుందని వారు మళ్ళీ నిరూపించారు. మన దేశం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడి, మన సాయుధ దళాలకు దృఢంగా మద్దతు ఇస్తుంది : నారా చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ సిఎం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం మొత్తం ఐక్యంగా ఉంది. భారత సైన్యం యొక్క ధైర్యం మరియు పరాక్రమం పట్ల దేశం మొత్తం గర్విస్తోంది : బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఎక్స్ లో పోస్ట్ ఒక భారతీయ పౌరుడిగా, ముందుగా మన సాయుధ దళాలకు బలంగా అండగా నిలుస్తున్నాం. పాకిస్తాన్ – పీఓకేలోని ఉగ్రవాద శిబిరాలపై దాడులు మనల్ని గర్వపడేలా చేస్తున్నాయి. ఇది జాతీయ సంఘీభావం, ఐక్యతకు సమయం మనమందరం ఒక్కటిగా నినదిద్దాం. – జై హింద్! – రేవంత్ రెడ్డి, తెలంగాణ సిఎం దశాబ్దాలుగా ఓర్పు సహనం! "ఆపరేషన్ సింధూర్" ద్వారా అఖండ భారతావనిలో మరోసారి ధైర్య స్ఫూర్తిని నింపిన త్రిసేన సాహసోపేతమైన నాయకత్వానికి, వారికి అండగా నిలబడ్డ ప్రధాని మోడీకి హృదయపూర్వక ధన్యవాదాలు ! మేము ఎల్లప్పుడూ మీతోనే ఉంటాము. జై హింద్!! : పవన్ కళ్యాణ్, ఏపీ డిప్యూటీ సిఎం పాక్ ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం "ఆపరేషన్ సింధూర్" పేరుతో ప్రతి దాడులు చేయడం హర్షణీయం. ఇది దేశానికి గర్వకారణం. భారత సైన్యానికి శుభాకాంక్షలు. జై హింద్..జై భారత్ : వైఎస్ షర్మిల పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సర్జికల్ దాడులను స్వాగతిస్తున్నాం. మరో పహల్గామ్ పునరావృతం కాకుండా పాకిస్తాన్ కి కఠినమైన గుణపాఠం నేర్పించాలి : అసదుద్దీన్ ఒవైసీ

## మే8న అఖిలపక్ష సమావేశం



న్యూఢిల్లీ : ఆపరేషన్ సింధూర్‌పై వివరాలను తెలిపేందుకు కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చింది.పహల్గాం ఉగ్రదాడికి ప్రతి చర్యగా ఆపరేషన్ సింధూర్ పేరిట బుధవారం తెల్లవారుజామున పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె)లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం దాడులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ దాడికి సంబంధించిన వివరాలను రాజకీయ పార్టీలకు వివరించనుంది. గురువారం ఉదయం 11.00 గంటలకు పార్లమెంట్ లైబ్రరీ భవనంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్‌రిజిజు బుధవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది.ు

## కర్రెగుట్టల్లో భారీ ఎన్కౌంటర్

### 22 మంది మావోయిస్టులు మృతి



చర్ల:తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని బీజాపూర్ జిల్లా కర్రెగుట్టల్లో భారీ ఎన్కౌంటర్ జరిగింది. బుధవారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 22 మంది మావోయిస్టులు మృతి చెందారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. వారందరూ ప్రమాదం నుంచి బయటపడ్డారని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు వందలాది నక్సలైట్ దాక్కున్న ప్రదేశాలు, బంకర్లను ధ్వంసం చేశామని, పేలుడు పదార్థాలు, డిటోనేటర్లు, ఆహార నిల్వలు, రోజువారీ ఉపయోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నామని ఒక అధికారి చెప్పారు. ఇప్పటివరకు(ఈ సంవత్సరంలో)రాష్ట్రంలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 146 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో 129 మంది బీజాపూర్‌తో సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో మరణించిన వారే ఉన్నారు.

## దేశంలోకెల్లా అత్యంత కరడుగట్టిన జైలు తిరిగి తెరవాలని ట్రంప్ సంచలన నిర్ణయం

అమెరికాలో అత్యంత కఠినమైన జైలు అల్కట్రాజ్‌ను తెరవాలని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయించారు. శాన్‌ఫ్రాన్సిస్కో సముద్ర జలాల్లో ఉన్న ఈ జైలు ఒకప్పుడు తీవ్ర అపఖ్యాతి పాలైంది. ది రాక్‌గా ప్రసిద్ధికెక్కిన జైలు 60 ఏళ్ల కింద మూతపడింది. దశాబ్దాల క్రితం పర్యాటక ప్రాంతంగా మారింది. ఏటా లక్షలాది మంది సందర్శిస్తున్నారు. అలాంటి జైలును మళ్లీ ఉపయోగంలోకి తెచ్చేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. శిథిలావస్థలో ఒకప్పటి ప్రమాదకర జైలును పునరుద్ధరించడం సరికాదని నిపుణులు అంటున్నా పట్టించుకోవడం లేదు.

### అల్కట్రాజ్ గురించి ట్రంప్

ఈ ద్వీప జైలును తెరవడమే గాక విస్తరించాలని ఆదేశించినట్లు ట్రంప్ తన సొంత సోషల్ మీడియా హాండిల్ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. దుర్మార్గులు, హింసాత్మక, ప్రమాదకర నేరస్తులతో అమెరికా చాలాకాలంగా ఇబ్బందులు పడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. అల్కట్రాజ్ తన దృష్టిలో శాంతిభద్రతలను కాపాడగల అతి బలమైన, శక్తివంతమైన ప్రదేశమని అనంతరం మీడియాతో కూడా చెప్పుకొచ్చారు. దేశంలో ప్రస్తుతం శాంతిభద్రతలు చాలా అవసరం గనుక దాన్ని మళ్లీ తెరవబోతున్నట్టు చెప్పారు. జైలు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నప్పటికీ దాన్ని తెరిచే ఆలోచన బాగుందన్నారు. అమెరికా పౌరులు, జాతీయ భద్రత కోసం ఇప్పుడా జైలు అత్యంత అవసరమని సరిహద్దు అధికారి టామ్ హెూమన్ కూడా అన్నారు.

### షార్క్‌ల కాపలా...

అల్కట్రాజ్. ఒక్కమాటలో చెప్పాలంటే అండమాన్‌లోని కరడుగట్టిన కాలాపానీ వంటి జైలు. శాన్‌ఫ్రాన్సిస్కోకు రెండు కిలోమీటర్ల దూరంలో ఒక చిన్న ద్వీపంలో ఉంది. దీన్ని మొదట నావికా రక్షణ కోటగా నిర్మించారు. 20వ శతాబ్ద ప్రారంభంలో సైనిక జైలుగా మార్చారు. 1934లో అధికారికంగా ఫెడరల్ జైలుగా మార్చేశారు. దీని భద్రత అత్యంత కట్టుదిట్టంగా ఉంటుంది. తప్పించుకోజూడటమంటే ప్రాణాలు పణంగా పెట్టడమే. ఎందుకంటే ద్వీపం చుట్టూ సముద్రంలో షార్కులుంటాయి. జైలు నుంచి ఎలాగోలా తప్పించుకున్నా వాటికి ఆహారంగా మారతారు. అమెరికాలోని అత్యంత క్రూరమైన నేరస్తులను ఇక్కడ ఉంచేవారు. బలమైన సముద్ర అలలతో పాటు అతి శీతల పసిఫిక్ జలాలతో కూడిన అల్కట్రాజ్ ఖైదీలకు అక్షరాలా నరకప్రాయం. ఈ జైలులో గ్యాంగ్‌స్టర్ అల్ కాపోన్, జార్జ్ మెషీన్ గన్ కెల్లీ వంటి కరడుగట్టిన నేరస్తులను ఉంచారు. దీనిపై అనేక సినిమాలు వచ్చాయి. నిర్వహణ అత్య ంత ఖరీదుగా మారడంతో 1963లో అటార్నీ జనరల్ రాబర్ట్ కెన్నెడీ దీని మూసివేయించారు. ఈ జైలు, ద్వీపం ఇప్పుడు నేషనల్ పార్క్ సర్వీస్ నిర్వహణలో ఉన్నాయి. ఏటా 14 లక్షల మంది దీన్ని సందర్శిస్తున్నారు.

## అల్కట్రాజ్.. అమెరికా కాలాపానీ!



### గతంలోనూ ప్రయత్నాలు

ఈ కేంద్రాన్ని డిటెన్షన్ సెంటర్‌గా తెరవాలని గతంలోనూ పలువురు నేతలు విఫలయత్నం చేశారు. 1981లో 'మారియల్ బోట్ లిఫ్ట్'లో క్యూబా నుంచి ఫ్లోరిడాకు వచ్చిన 20,000 మంది శరణార్థులను ఉంచడానికి నాటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ ప్రతిపాదించిన 14 ప్రాంతాల్లో ఇదీ ఒకటి. చారిత్రక పర్యాటక ప్రదేశం కావడం, అంతమందికి సౌకర్యాలు లేకపోవడంతో వెనక్కు తగ్గారు.

### నిర్వహణ అసాధ్యమంటున్న నిపుణులు..

అల్కట్రాజ్‌ను తిరిగి తెరవడంపై జైలు నిపుణులు, చరిత్రకారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మొదట ఈ విషయం వినగానే జోక్ అనుకున్నట్టు బీఓపీ తాత్కాలిక డైరెక్టర్‌గా చేసిన హ్యూ హుర్విట్జ్ చెప్పారు. "దాన్ని మరమ్మతు చేయాలనుకోవడం హాస్యాస్పదం. ఆరడుగుల వ్యక్తి నిటారుగా నిలబడలేని గదులతో కూడిన భవనాలవి. పైగా కూలిపోతున్నాయి. సరైన భద్రత, ఫెన్సింగ్, కెమెరాలు కూడా లేవు. ఆ జైలును ఇప్పుడు నడపడం అసాధ్యమన్నారు. "1963లో జైలును మూసినప్పుడు ఖైదీల తలసరి నిర్వహణ ఖర్చు 13 డాలర్ల దాకా ఉండేది. ఇతర ఫెడరల్ జైళ్లలో అది ఐదు డాలర్లలోపే. ఇప్పుడు ఇతర జైళ్లలోనే 120 డాలర్లకు పెరిగింది. ఆ లెక్కన అల్కట్రాజ్‌లో కనీసం 500 డాలర్లు కావాలి. అంతంత వెచ్చి ంచి దోషులను అక్కడుంచడం చాలా ఖరీదైన వ్యవహారం"అని చరిత్రకారుడు జాన్ మార్టిని తెలిపారు. అమెరికాలో అత్యంత కఠినమైన జైలు అల్కట్రాజ్‌ను తెరవాలని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయించారు. శాన్‌ఫ్రాన్సిస్కో సముద్ర జలాల్లో ఉన్న ఈ జైలు ఒకప్పుడు తీవ్ర అపఖ్యాతి పాలైంది. ది రాక్‌గా ప్రసిద్ధికెక్కిన జైలు 60 ఏళ్ల కింద మూతపడింది. దశాబ్దాల క్రితం పర్యాటక ప్రాంతంగా మారింది. ఏటా లక్షలాది మంది సందర్శిస్తున్నారు. అలాంటి జైలును మళ్లీ ఉపయోగంలోకి తెచ్చేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. శిథిలావస్థలో ఒకప్పటి ప్రమాదకర జైలును పునరుద్ధరించడం సరికాదని నిపుణులు అంటున్నా పట్టించుకోవడం లేదు.

## ప్రాణంపోసే నిర్ణయం




అనునిత్యం నెత్తుటి చరిత్ర రచిస్తున్న రహదారులపై దుర్మరణాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక మంచి ప్రయత్నం చేసింది. సోమవారం విడుదలైన ఒక నోటిఫికేషన్ ప్రకారం ఇకపై రోడ్డు ప్రమాదాల్లో చిక్కుకున్నవారికి ఆస్పత్రుల్లో నగదురహిత చికిత్స వెనువెంటనే అందుతుంది. ప్రమాద బాధితులకు లక్షన్నర రూపాయల వరకూ చికిత్స సదుపాయం లభించటంతోపాటు వారం రోజుల వరకూ వైద్య సేవలు పొందే వెసులుబాటునిచ్చారు. దేశంలో ఏ రోడ్డుపై ప్రమాదం జరిగినా ఈ పథకం వర్తిస్తుందని నోటిఫికేషన్ చెబుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఏడాది పాలన పూర్తి చేసుకున్నాక 2015 జూలైలో 'మన్ కీ బాత్' కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలను ప్రస్తావించారు. బాధితులకు చికిత్స చేయటంలో ఆస్పత్రులు వెనుకంజ వేయకుండా నగదురహిత వైద్యానికి వీలుకల్పిస్తామని ఆ సందర్భంలోనే చెప్పారు. అది ఇన్నాళ్లకు సాకారమైంది. ప్రమాదాల నియంత్రణకు కేంద్రం అనేక చర్యలు తీసుకుంటూనేవుంది. కానీ పెద్దగా ఫలితాన్నిస్తున్న జాడ కనబడదు. ఏటా వెల్లడయ్యే గణాంకాలే ఇందుకు సాక్ష్యం. కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ మొన్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో మాట్లాడుతూ ఏటా మన రహ దారులపై దాదాపు 4,80,000 ప్రమాదాలు సంభవిస్తున్నాయని, 1,78,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పినప్పుడు అందరూ దిగ్భ్రాంతి చెందారు. ఈ ప్రమాద మృతుల్లో 60 శాతం మంది 18–34 యేళ్ల మధ్య వయస్కులేనని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా తన మంత్రిత్వశాఖ నిస్సహాయతను కూడా వివరించారు. 2024 ఆఖరుకల్లా రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య 50 శాతం మేరకు తగ్గించాలని నిర్ణయించుకున్నా ఏమాత్రం సాధ్యపడలేదని, పైపెచ్చు అవి మరింత పెరిగాయని ఆయన ఒప్పుకున్నారు. ప్రమాదాల నివారణ మాట అటుంచి బాధితులకు సకాలంలో వైద్యసాయం అందితే చాలామందిని మృత్యుముఖం నుంచి బయటకు తీసుకురావొచ్చని నిపుణులు ఎప్పటినుంచో చెబుతున్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవిస్తే చికిత్స ఆలస్యం కావటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ డబ్బు విదిలిస్తే తప్ప చికిత్సకు ముందుకురాని ఆస్ప త్రుల కారణంగా అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇది గమనించే ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకంలో క్షతగాత్రులకు తక్షణ వైద్యసాయం అందే వెసులుబాటు కల్పించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అదికాస్తా అటకెక్కింది. ప్రపంచంలో రోడ్డు ప్రమాదాల బెడదపై నాలుగేళ్లక్రితం ఐక్యరాజ్యసమితి దృష్టి సారించింది. 2021–30 మధ్య ఈ ఉదంతాల్లో మరణాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని లక్ష్యనిర్దేశం చేసింది. ఆ మాటెలా వున్నా కేవలం పెను వేగంతో వెళ్లే వాహనాల వల్లనే ప్రమాదాలు చోటుచేసుకుంటా యన్నది నిజం కాదు. మొన్న మార్చిలో జరిగిన సదస్సులో కేంద్రమంత్రి గడ్కరీయే ఈ విషయాన్ని అంగీకరించారు. ఇరుకురోడ్డని, మలుపు వున్నదని, వేగం తగ్గించాలని సూచించే బోర్డులూ, మార్కింగ్‌లూ అవసరమైనచోట్ల లేకపోవటం దగ్గర్నుంచి నిర్మాణపరంగా వుండే లోపాల వరకూ అనేకానేక మైనవి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. సివిల్ ఇంజనీర్లు మొదలుకొని కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్ల వరకూ ఎవరికీ దీనిపై జవాబుదారీతనం లేదు. సవివర ప్రణాళికా నివేదిక (డీపీఆర్)లు నాసిరకంగా వున్నా అడిగేవారు లేరు. ఆధునిక సాంకేతికతలు అందుబాటులోకి రావటం వల్ల లోపాలను ముందు గానే సులభంగా పసిగట్టడం సాధ్యమవుతోంది. వాటిని అనుసరిద్దామన్న ఆలోచన కూడా రాదు. అతి తక్కువ ప్రమాదాలు జరుగుతున్న ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, స్పెయిన్ దేశాల్లో ఎలాంటి విధానాలు అనుసరిస్తున్నారో గమనించి, వాటిని అమల్లోకి తెచ్చినా ఎంతో ప్రయోజనం కలుగుతుంది. అసలు మన రోడ్ల నాణ్యతకూ, అమ్మే వాహనాలకూ సంబంధమే లేకుండా పోయింది. అమ్మ కాలు పెంచుకోవటం కోసం అనేక రకాల పథకాలు ప్రవేశపెట్టి, బ్యాంకు లోన్ల సదుపాయం కల్పించి జనంలో వ్యామోహాన్ని పెంచటం రివాజైంది. ద్విచక్ర వాహనాలు సైతం వాయు వేగంతో పోయేలా డిజైన్ చేస్తుంటే...అవి నిండా ఇరవయ్యేళ్లు లేనివారి చేతికొస్తుంటే ప్రమాదాలు జరగటంలో వింతేముంది? రోడ్డు ప్రమాదాల విషయంలో సర్వోన్నత న్యాయస్థానం చొరవ తీసుకుని అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెఎస్ రాధాకృష్ణన్ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కేరళ, యూపీ, నాగాలాండ్ మినహా మరే రాష్ట్రమూ రహదారి భద్రతకు సంబంధించిన విధానమే రూపొందించుకోలేదని ఆ కమిటీ నివేదిక ఎత్తిచూపింది. డ్రైవింగ్ లైసె న్సుల జారీలో, భద్రతా నిబంధనల అమలులో ప్రభుత్వాలు అలసత్వాన్ని చూపుతున్నాయని చెప్పింది. ఇప్పటికైనా అన్ని రాష్ట్రాలూ ఈ లోపాలన్నిటినీ సరిదిద్దుకున్నాయో లేదో సందేహమే! తొలి గంటలో చికిత్స ప్రారంభిస్తే గాయపడినవారిలో కనీసం 50 శాతంమందికి ప్రాణాపాయం తప్పుతుందని వైద్య నిపుణులంటున్న మాట. గతంలో అయితే అసలు ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఆస్పత్రికి తరలించటానికి ఎవరూ ముందుకొచ్చేవారు కాదు. పోలీసులు తమనే అనుమాని తులుగా చూస్తారని, కోర్టుల చుట్టూ తిరగాల్సివస్తుందని చాలామంది భయపడేవారు. ఇందుకు సంబంధించిన నిబంధనలు మార్చాక ఈ విషయంలో చాలా మార్పువచ్చింది. నగదు రహిత చికిత్స అందించటానికి వీలుకల్పించే చర్య ప్రశంసనీయమైనది. కానీ అంతకన్నా ముందు ప్రమాదా లకు దారితీస్తున్న పరిస్థితుల్ని చక్కదిద్దటానికి ప్రయత్నించాలి. అన్ని స్థాయుల్లో జవాబుదారీతనం నిర్ణయించాలి. అప్పుడుగానీ ప్రమాదాల నియంత్రణ సాధ్యంకాదు.

## వాళ్లు కేనిబాల్స్ కాదు!



మనుషుల్ని పీక్కు తినేవారిని 'కేనిబాల్స్' అంటారు. ప్రభుత్వ ఉద్యోగుల్ని, ప్రభుత్వంతో సంబంధంవున్న ఆర్టీసీ, సింగరేణి, విద్యుత్ ఉద్యోగులందర్నీ కలిపి నరమాంస భక్షకులతో పోల్చారు మన ముఖ్యమంత్రి వర్యులు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంపూర్ణంగా తెలిసే గత ఎన్నికల సందర్భంగా ఎడాపెడా వాగ్దానాలు చేశారు. అవే కాంగ్రెస్‌ను ఒడ్డుకు చేర్చాయి. తీరా గెలిచాక అటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకి, ఇటు ఆర్టీసీ కార్మికులకు తానేమీ చేయలేనని చేతులెత్తేశారు. ప్రభుత్వ ఉద్యోగులు వంటింటి కుందేళ్ళనీ, అధికార పార్టీకి అంటకాగుతుంటారని ప్రస్తుత, గత పాలకులకు గట్టి నమ్మకం. వారు అపర ధర్మరాజులనీ, వారికి కోపమేరాదని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఊహాలోకాల్లో విహరిస్తుందనుకుంటా. "అలుగుటయే ఎరుంగని మహా మహితాత్ముడు అజాత శత్రువే (ధర్మరాజుకు ఇంకో పేరు) అలిగిన నాడు సాగరములన్నియు ఏకముగాకపోవు" నన్న క్రిష్ణరాయబారంలోని పద్యము ఈ పాలకుల చెవులు చిల్లులు పడేలా ఎవరైనా చెప్పి పుణ్యం కట్టుకోండి! పాలకులతో దగ్గరగా ఉంటే ఏవైనా పైరవీలవుతాయేమోగాని సాధారణ సమస్యలు, అదీ ఉద్యోగులందరికీ సంబంధించిన సమస్యలు పరిష్కారం కావు. ఈ విషయం అనుభవపూర్వకంగా 2018–23 మధ్య రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులందరికీ తెలిసొచ్చింది. వారంతా కుతకుతా ఉడికిపోయారు. తమ ఆర్థిక డిమాండ్లే తప్ప సాధారణ ప్రజల సమస్యలు పట్టించుకోరనే అపప్రథ ప్రభుత్వ ఉద్యోగులపై ఉంది. పాలనా యంత్రాంగాన్ని సాధారణ ప్రజల నుండి విడదీసిన ఇంగ్లీషోడి పథకంలో భాగమే అదంతా. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ పాలకులు దాన్ని కొనసాగించారు. చాలామంది నాయకులు ఆ బురద కడుక్కోలేకుండా ఉన్నారు. సర్వీసు రూల్స్ పేర ప్రభుత్వ ఉద్యోగులను రాజకీయ పార్టీల వైపు చూడనివ్వలేదు మన పాలకులు. సాధారణ ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి దూరంగా ప్రభుత్వ ఉద్యోగులనుంచారు. కనీసం ఇంగ్లండ్‌లో సివిల్ సర్వెంట్స్ యూనియన్ బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌లో సభ్యత్వం కలిగి ఉంది. అలాంటి స్థితి మన దేశంలో లేదు. తమ సభ్యులకు రాజకీయ 'కాలుష్యం' అంటకుండా చూసుకోవాలని కొందరు నాయకుల ప్రయత్నం. అపుడు తాము పాలకులకు అంటకాగచ్చని వారి భావన. ఇటు ప్రభుత్వోద్యోగులు, అటు ఆర్టీసీ కార్మికులు ఆందోళనబాట పట్టారు. రాష్ట్ర ప్రభుత్వం 1973–74 నాటి ఇందిరాగాంధీ రోజులకెళ్ళిందను కుంటా. ఆనాడు ఆమె ఇన్సూరెన్స్, బ్యాంకు, ప్రభుత్వరంగ కార్మికులను 'హైవేజ్' ఐలాండర్లని పిలిచింది. దేశమంతా దరిద్రంలో మగ్గిపోతూంటే అత్యధిక వేతనాలున్న ద్వీపాలుగా ఉన్నారని ఆ ఉద్యోగుల్ని తెగనాడింది. అసంఘటిత కార్మికులకు, సంఘటిత కార్మికులకు, సామాన్య రైతులకు, మహిళలకు ఇచ్చే రాయితీలను, సంక్షేమ పథకాలను ప్రభుత్వోద్యోగులకిచ్చే జీతాలతో పోటీ పెట్టి బెదిరించ చూడటం రాష్ట్ర కార్మికోద్యమం ఆమోదిస్తుందా? పైగా ఆర్థికేతర డిమాండ్లే తమ వాటిలో అత్యధికం ఉన్నాయని ఉద్యోగ సంఘాల నాయకులు చెప్పేది ఈ ప్రభుత్వం వినదా?! తెలంగాణ ఏర్పడ్డాక మన శాసన సభ్యుల వేతనాలు, అలవెన్సులు 163 శాతం పెరిగినాయట! మరి ఏ ఒక్క రంగంలోని కార్మికులు, ఉద్యోగులకు ఏపాటి పెరిగినాయో చెప్పగలరా? ప్రభుత్వానికి ఏ సంబంధంలేని ప్రయివేటురంగ కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని అడిగినా గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలకులకు కడుపునొప్పెందుకు? ఆర్టీసీ కార్మికులకు 2022 ఏప్రిల్ నుండి రావాల్సిన లీవ్ ఎన్‌కాష్‌మెంట్ మనిషికి ఆరు లక్షల రూపాయల చొప్పున ఏడున్నర వేల మందికి రాకపోతే వారికి కడుపుమండదా? ఐదు నెలల గ్రాట్యుటీ బకాయిలు ఇవ్వకపోయినా అందరికీ 'రెస్పాన్సిబిలిటీ' ఉంది కాబట్టే ఇంతకాలం ఆగారు రేవంత్‌రెడ్డిగారూ! రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో దాదాపు లక్షన్నర ఖాళీ పోస్టులున్నాయి. వాటిని నింపకుండా చిరుద్యోగులపై పడ్డది ప్రభుత్వం. ఔట్‌సోర్సింగ్ వారిని తొలగిస్తారట! ఇదేం అన్యాయం? డబ్బుల్లేవని బీదరుపులు అరిచే పాలకులు ఏమవసరమని అందాలపోటీలకు రూ.200 కోట్లు మంజూరు చేశారు? ప్రతిదానికీ ప్రతి మంత్రీ హెలీకాప్టరెక్కి పయనమవు తున్నారు. ముఖ్యమంత్రి తాను వాడలేదంటున్నారు. నమ్ముదాం. తన సహచర మంత్రుల 'గాలి చక్కర్ల'కి బాధ్యతెవరిది? అది అవసరమా?! కేంద్రం నుండి రావాల్సిన బకాయిలపై నోరెందుకెత్తరు మహాశయా? అసలు జీఎస్‌టీ తమ పథకమేనన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి బకాయిపడ్డ ఎస్‌జీఎస్‌టీ బకాయిల కోసమైనా కేంద్రంతో ఘర్షణపడ్డ ఒక్కటి కూడా కానరాదు. సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్‌ల్లో మన వాటా కోసం ప్రభుత్వం నోరు పెగలద్దు. వెనకబడిన జిల్లాల అభివృద్ధి కోసం కేంద్రం ఇవ్వాల్సిన నిధులు అడగరా? తాగునీటి పథకాల కోసం రూ.15 వేల కోట్లు తెలంగాణకు ఇవ్వాలని 15వ ఆర్థిక సంఘమే సిఫారసు చేసింది. దానికీ దిక్కులేదు. ఈ నిధులన్నీ రాబట్టగలిగితే ఇంత బీదరుపులు అరవాల్సిన దుస్థితి ఉండదుకదా. రావాల్సిన వాటి కోసం కేంద్రంతో తగాదా పడటం ఆపి ప్రభుత్వ ఉద్యోగులతో యుద్ధం చేయటం ఏం న్యాయం?

ప్రభాత సూర్యుడు

సంపాదకీయం

# కులగణన: ఆవశ్యకత, సవాళ్లు (విశ్లేషణ)

భారత దేశంలో కులగణన ఎప్పుడూ ఒక వేడి చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత దేశంలో అన్ని కులాల సమగ్ర గణన జరగలేదు. 1951 నుండి 2011 వరకు జరిగిన జనాభా లెక్కలలో కేవలం షెడ్యూల్డ్ కులాలు, తెగల గణాంకాలను మాత్రమే సేకరించి ప్రచురించారు. ఇతర కులాల సమగ్ర గణన ఇప్పటి వరకు జరగలేదు. అయితే 2011లో సామాజిక, -ఆర్థిక కులగణన జరిగింది కానీ దాని ఫలితాలు ఇంకా అధికారికంగా విడుదల కాలేదు. ఇప్పుడు 2025లో జరగబోయే జనాభా లెక్కల్లో కులగణన ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఈ అంశానికి మళ్లీ ప్రాధాన్యం సంతరించుకుంది. కులగణన ప్రాముఖ్యతను ఎవరూ కాదనలేరు. ఇది ముఖ్యంగా సామాజిక న్యాయం, సమానత్వం సాధించే దిశలో ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం విద్య, ఉద్యోగ రంగాల్లో అమలవుతున్న రిజర్వేషన్ల విధానం పాత జనాభా అంచనాలపై ఆధారపడి ఉంది. కులగణన ద్వారా ప్రతి కులం ఖచ్చితమైన జనాభా సంఖ్య తెలుస్తుంది. ఈ సమాచారం ఆధారంగా రిజర్వేషన్ల విధానాన్ని మరింత సమర్థవంతంగా, న్యాయంగా పునఃపరిశీలించే అవకాశం ఉంటుంది. ఏయే కులాలకు ఎంత ప్రాతినిధ్యం అవసరమో గుర్తించి ప్రస్తుతం సమాజంలో నెలకొన్న అసమానతలను తగ్గించవచ్చు. అంతేకాకుండా కులగణన వివిధ కులాల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులపై సమగ్రమైన సమాచారాన్ని అందిస్తుంది. ఈ డేటా ఆధారంగా ప్రభుత్వం ప్రతి కులం ప్రత్యేక అవసరాలను గుర్తించి వారికి లక్షిత అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు రూపొందించవచ్చు. విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి కీలక రంగాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన కులాలను గుర్తించడం సులభమవుతుంది. ఇది వెనుకబడిన వర్గాల అభివృద్ధికి మరింత దోహదపడుతుంది. కులగణన వెనుకబడిన కులాల వాస్తవ పరిస్థితిని సమాజానికి తెలియజేస్తుంది. ఇది సమాజంలో వారి స్థానాన్ని మెరుగుపరచడానికి, వారు ఎదుర్కొంటున్న వివక్షను రూపుమాపడానికి, వారి సాధికారతను పెంపొందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఒక బలమైన పునాదిని అందిస్తుంది. చారిత్రక అన్యాయాలను సరిదిద్దడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణించవచ్చు. వనరుల కేటాయింపులో కూడా కులగణన కీలకపాత్ర పోషిస్తుంది. వివిధ కులాల జనాభా నిష్పత్తి, వారి అవసరాలపై ఖచ్చితమైన సమాచారం ఉంటే ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి రంగాలకు నిధులను మరింత సమర్థవంతంగా కేటాయించగలదు. ఇది ప్రాంతీయంగా కులాల వారీగా ఉన్న అభివృద్ధి అంతరాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కులగణన డేటా సామాజిక శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, ఇతర పరిశోధకులకు కుల వ్యవస్థ డైనమిక్స్‌ను అధ్యయనం చేయడానికి, వివక్ష మూలాలను గుర్తించడానికి సమర్థవంతమైన పరిష్కారాలను సూచించడానికి, ఒక విలువైన వనరుగా ఉపయోగపడుతుంది. ఇది విధాన రూపకర్తలకు ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుంది. భారత దేశం విశాల జనాభా, భౌగోళిక వైవిధ్యం కారణంగా సమగ్రమైన కులగణన నిర్వహించడం ఒక పెద్ద సవాలు. దేశంలో వేల సంఖ్యలో కులాలు, ఉపకులాలు ఉన్నాయి. వాటిని ఖచ్చితంగా వర్గీకరించడం ఒక పెద్ద సమస్య. ఒకే పేరుతో వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు సామాజిక స్థానాలు కలిగిన కులాలు ఉండవచ్చు. దీనికి స్పష్టమైన, ప్రామాణికమైన వర్గీకరణ మార్గదర్శకాలను అభివృద్ధి చేయడం అవసరం. భాషా, ప్రాంతీయ వైవిధ్యాలను పరిగణనలోకి తీసుకోవాలి. అవసరమైతే సాంకేతికతను ఉపయోగించి డేటాను విశ్లేషించాలి, నిపుణుల సలహాలు తీసుకోవాలి. కాలక్రమేణా వ్యక్తులు, సమూహాలు తమ కుల గుర్తింపును మార్చుకునే అవకాశం ఉంది. రిజర్వేషన్ల కోసం లేదా సామాజిక ఉన్నతి కోసం ఇలా జరగవచ్చు. ఈ సమస్యను అధిగమించడానికి ప్రజల నుండి నేరుగా వారి కుల వివరాలను అడగడం, స్వీయ గుర్తింపును ప్రామాణికంగా తీసుకోవడం ఉత్తమం. డేటా సేకరణలో పక్షపాతం కూడా ఒక ముఖ్యమైన సవాలు. గణన సిబ్బంది వారి వ్యక్తిగత నమ్మకాలు లేదా అంచనాల ఆధారంగా తప్పుగా డేటా నమోదు చేసే అవకాశం ఉంది. దీనిని నివారించడానికి సిబ్బందికి కులం సున్నితత్వాన్ని ఖచ్చితమైన డేటా సేకరణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ సమగ్రమైన శిక్షణ ఇవ్వాలి. పర్యవేక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేయాలి, యాదృచ్ఛిక తనిఖీలు నిర్వహించాలి. కులగణన రాజకీయంగా సున్నితమైన అంశం కాబట్టి తప్పుడు సమాచారం ఇవ్వడానికి లేదా డేటాను తారుమారు చేయడానికి ఒత్తిడులు ఉండవచ్చు. డేటా సేకరణ ప్రక్రియను పారదర్శకంగా ఉంచడం, డేటా భద్రత గోప్యతను నిర్ధారించడం చాలా ముఖ్యం. రాజకీయ జోక్యాన్ని నివారించడానికి స్వతంత్ర సంస్థల పర్యవేక్షణను ఏర్పాటు చేయాలి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. దీనిని అధిగమించడానికి ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం, దశలవారీగా గణన నిర్వహించడం, వనరులను తెలివిగా కేటాయించడం అవసరం. ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం కూడా ముఖ్యమైనది. కులగణన ఉద్దేశం, దాని సంభావ్య ఉపయోగాల గురించి ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల వారు తప్పుడు సమాచారం ఇవ్వవచ్చు లేదా సహకరించకపోవచ్చు. దీనిని అధిగమించడానికి విస్తృతమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి. మీడియా ప్రజా నాయకుల సహకారం తీసుకోవడం కూడా ఉపయోగపడుతుంది. చివరగా సేకరించిన కులాల డేటా గోప్యత, భద్రతను నిర్ధారించడం చాలా ముఖ్యం. డేటా లీక్ కావడం లేదా దుర్వినియోగం కావడం జరిగితే తీవ్రమైన పరిణామాలు ఉండవచ్చు. డేటా నిల్వ, నిర్వహణ కోసం కఠినమైన భద్రతా ప్రోటో కాల్‌లను అనుసరించాలి అధునాతన సాంకేతికతలను ఉపయోగించాలి. కులగణన సఫలం కావాలంటే అనేక జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. స్పష్టమైన లక్ష్యాలు, పరిధిని నిర్దేశించడం, సమగ్రమైన ప్రణాళిక వ్యూహం రూపొందించడం, ఖచ్చితమైన వర్గీకరణ వ్యవస్థను అభివృద్ధి చేయడం, సమర్థవంతమైన శిక్షణ ఇవ్వడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, పారదర్శకత పాటించడం, డేటా గోప్యతను నిర్ధారించడం, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, రాజకీయ జోక్యాన్ని నివారించడం, నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడం, క్రమానుగత పర్యవేక్షణ చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కులగణన మరింత విజయవంతం కాగలదు. సామాజిక న్యాయం సమానత్వం సాధనలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

# ఉగ్రమూక పైకి ఉక్కు డేగలు... ఇనుప సుత్తులు..!



: పాక్‌లోని ఉగ్రవాదులకు కాళరాత్రి అంటే ఏమిటో భారత్ చూపించింది. త్రివిధ దళాలు అత్యంత సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ కోసం భారత్ అమ్ములపొదిలో నుంచి అత్యాధునిక ఆయుధాలను బయటకు తీసింది. ఆత్మాహుతి డ్రోన్లు.. స్కాల్ప్ క్షిపణులు.. హ్యామర్ బాంబులను వాడినట్లు ప్రాథమిక సమాచారం ఆధారంగా తెలుస్తోంది. వాస్తవానికి మిలిటరీ ఆపరేషన్లకు ఏ రకం ఆయుధాలు వాడారన్నది దళాలు ఎన్నడూ బహిర్గతం చేయవు. కానీ, అవి లక్ష్యాలను ఛేదించిన తీరు ఆధారంగా అంచనాలకు వస్తుంటారు. తాజాగా ఆపరేషన్ సిందూర్‌లో తొమ్మిది ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసేందుకు వేర్వేరు ప్రదేశాల నుంచి ఏకకాలంలో దాడులు నిర్వహించారు.

ఉగ్ర స్థావరాలపై ఆత్మాహుతి డ్రోన్లు

ఈ దాడులకు దళాలు ఆత్మాహుతి డ్రోన్లను వినియోగించినట్లు తెలుస్తోంది. వీటిని లాయిటరింగ్ మ్యూనిషన్ అని వ్యవహరిస్తారు. ఇవి నిర్దేశించిన ప్రాంతాలను చేరుకొని.. లక్ష్యాలను గుర్తించి.. వాటిపై విరుచుకుపడతాయి. వీటిల్లో నిఘా సామర్థ్యాలు కూడా ఉంటాయి. భారత్ అమ్ముల పొదిలో ఈ రకం డ్రోన్లు చాలా ఉన్నాయి. వీటి వినియోగంతో మన దళాల వైపు ప్రాణనష్టం ప్రమాదాన్ని నివారించవచ్చు. దీంతోపాటు కదలుతున్న లక్ష్యాలను కచ్చితంగా ఛేదించేందుకు వాడతారు.

శత్రు దేశంలోకి చొచ్చుకెళ్లే స్కాల్ప్ (స్టామ్‌షాడో)..

స్కాల్ప్ క్షిపణులను స్టామ్‌షాడో అని కూడా అంటారు. వీటిని ఫ్రాన్స్ అభివృద్ధి చేసింది. ఇది దీర్ఘశ్రేణి క్రూజ్ మిసైల్. దాదాపు 250 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం దీనికి ఉంది. శత్రుదేశాల్లోకి చొచ్చుకెళ్లి దాడి చేసేందుకు వీటిని వినియోగిస్తారు. దీనిని యుద్ధ విమానాలపై నుంచి ప్రయోగించే అవకాశం ఉంది. భారత్ తాజాగా దాడిలో ఫ్రాన్స్ తయారీ రఫేల్స్ నుంచి దీనిని ప్రయోగించి ఉండొచ్చని భావిస్తున్నారు.

బంకర్లను ధ్వంసం చేసే హ్యామర్ బలంగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలు, బంకర్లను ధ్వంసం చేసేందుకు హ్యామర్ బాంబులను వినియోగిస్తారు. ఇది స్మార్ట్‌బాంబ్ కోవలోకి వస్తుంది. వీటి లక్ష్యానికి 50-70 కిలోమీటర్ల దూరం నుంచే ప్రయోగించవచ్చు. ఎంత ఎత్తు నుంచి దీనిని ప్రయోగిస్తున్నారన్న దానిపై ఇది ఆధారపడి ఉంటుంది. భారత్ దాడి చేసిన లక్ష్యాల్లో జేషేకు అత్యంత కీలకమైన బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్ ఉంది. ఇది సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. జైషే మహ్మద్‌కు చెందిన ప్రధాన కార్యాలయంగా పేర్కొంటారు. ఇక లష్కరే హెడ్‌క్వార్టర్ అయిన మర్కాజ్ తోయిబా కూడా ఉంది. సరిహద్దుకు 30 కిలోమీటర్ల దూరంలోని లష్కరే క్యాంపు కార్యాలయం ఇది. ఇక్కడే 26/11 ముంబయి దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు తలదాచుకున్నారని సమాచారం.

అత్యంత సమన్వయంతో..

పాక్‌లో ధ్వంసం చేయాల్సిన ఉగ్ర స్థావరాలపై దాడులను ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ, నేవీ సమన్వయం చేసుకొన్నాయి. అతిపెద్ద ఉగ్ర స్థావరాలైన బవహల్పూర్.. మురిద్కేలను ధ్వంసం చేసే బాధ్యత వాయుసేన స్వీకరించినట్లు తెలుస్తోంది. ఇక మిగిలిన వాటి సంగతి ఆర్మీ తీసుకొంది. నౌకాదళం తన నిఘా వ్యవస్థలైన పీ8ఐ విమానాలు, ఎంక్యూ9 డ్రోన్లతో సహకారం అందించింది.

# పాకిస్తాన్ పై భారత్ వైమానిక దాడి.. వరల్డ్ లీడర్స్ స్పందన ఇదే





గత నెలలో జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఘోరమైన దాడి తర్వాత బుధవారం తెల్లవారుజామున పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారతదేశం దాడి చేసింది. క్షిపణి దాడిలో కనీసం ఎనిమిది మంది మరణించారని పాకిస్తాన్ తెలిపింది. నియంత్రణ రేఖ వెంబడి పాకిస్తాన్ సైన్యం కాల్పులు జరిపిన ఫిరంగి దాడుల్లో ముగ్గురు పౌరులు మరణించారని భారత సైన్యం తెలిపింది. ఈ దాడికి బాధ్యులను జవాబుదారీగా ఉంచాలనే తన నిబద్ధతకు అనుగుణంగా ఉగ్రవాద శిబిరాలపై తాము దాడులు జరిపామని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పాకిస్తాన్ పై భారత్ వైమానిక దాడులపై వరల్డ్ లీడర్స్ స్పందించారు. పహల్గామ్ దాడికి ప్రతిస్పందనగా పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారతదేశం జరిపిన దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, ఏదో జరగబోతోందని అమెరికాకు తెలుసునని, "ఇది చాలా త్వరగా ముగిసిపోతుందని" తాను ఆశిస్తున్నానని అన్నారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, "భారతదేశం, పాకిస్తాన్ మధ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాను" అని %శ% లో పోస్ట్ చేశారు. ప్రస్తుత పరిస్థితి త్వరలోనే సద్దుమణుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్రిక్తతలను శాంతియుతంగా పరిష్కరించడానికి రెండు దేశాల సంబంధిత వ్యక్తులతో తాను సంప్రదిస్తానని పేర్కొన్నారు. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రూబియోతో మాట్లాడి భారతదేశ సైనిక చర్యల గురించి వివరించారని వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో భారత సైనిక కార్యకలాపాల గురించి ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ఆందోళన చెందుతున్నారని, భారతదేశం, పాకిస్తాన్‌లు సైనిక సంయమనం పాటించాలని ఆయన ప్రతినిధి పిలుపునిచ్చారు. భారత్, పాకిస్తాన్ మధ్య సైనిక ఘర్షణను ప్రపంచం భరించలేదు. "సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని, ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతికి ముప్పు కలిగించే ఉద్రిక్తతను నివారించాలని" యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ భారత్, పాకిస్తాన్‌లను కోరింది, అని యుఎఇ విదేశాంగ ఉప ప్రధాన మంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ట్రంప్ దెబ్బకు ఫలితాలు తారుమారు




ట్రంప్ దురుసు వ్యాఖ్యల ప్రభావం అమెరికాపై మాత్రమే కాదు, ఇతర దేశాల మీద కూడా కనబడుతోంది. తాజాగా జరిగిన కెనడా, ఆస్ట్రేలియా ఎన్నికలను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కెనడా పార్లమెంటు ఎన్నికల్లో లిబరల్ పార్టీ తిరిగి అధికారాన్ని చేజిక్కించుకుంటుందని ఎవరూ కలలో కూడా ఊహించలేదు. ఎందుకంటే, ఇటీవలే పదవినుంచి దిగిపోయిన జస్టిన్ ట్రూడో ఆ పార్టీకి చేసిన నష్టం అంతాఇంతా కాదు. కోరి ఇండియాతో కయ్యానికి కాలు దువ్వి, సిక్కు ఉగ్రవాదులకు వత్తాసు పలుకుతూ స్వజాతీయులైన కెనడియన్లలో కావలసినంత అప్రదిష్టను మూటగట్టుకున్నారు. జనవరి తొలివారంలో ఆయన రాజీనామా చేసేనాటికి విపక్ష కన్జర్వేటివ్ పార్టీకంటే అధికార లిబరల్ పార్టీ 20 పాయింట్లు వెనకబడి ఉంది. జనవరి మూడో వారంలో ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశాక, కెనడాలో వెంటవెంటనే మార్పు లు చోటుచేసుకున్నాయి.

ఇరుగుపొరుగు దేశాలతో స్నేహభావంతో మెలగాలనే ఇంగితం లేని అగ్రరాజ్యాధినేత కెనడా, మెక్సికో వంటి దేశాలతో తెగతెంపులు చేసుకునేందుకే ప్రయత్నించారు. అది చాలదన్నట్లు కెనడియన్ల మనోభావాలు దెబ్బతినేలా వాచాలత్వం ప్రదర్శించారు. కెనడాపై అధిక సుంకాలు విధించడమే కాదు. అమెరికాలో కెనడా 51వ రాష్ట్రం అవుతుందంటూ పదేపదే ఆయన చేసిన వ్యాఖ్యలు కెనడియన్లలో జాతీయ భావాన్ని రెచ్చగొట్టాయి.తమ ఉనికినే ప్రశ్నించేలా ట్రంప్ మహాశయుడు చేస్తున్న వ్యాఖ్యలు వారిని ఒక్కతాటిపై నిలిచేలా చేశాయి. అదే సమయంలో లిబరల్ పార్టీ పగ్గాలు చేపట్టిన మార్క్ కార్నీ ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకోవడంలో నూటికి నూరు శాతం విజయం సాధించారు. ట్రంప్‌ను తీవ్రంగా వ్యతిరేకించడం ద్వారా, ఎన్నికల సభలలో ట్రంప్ వ్యాఖ్యలను ఎండగట్టడం ద్వారా మెజారిటీ ఓటర్ల మనసు గెలుచుకున్నారు. మన దేశాన్ని విచ్ఛిన్నం చేయడం ద్వారా తన అధీనంలోకి తెచ్చుకునేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారంటూ ఆయన చేసిన ఎన్నికల ప్రసంగాలు ఓటర్లలో ఆలోచన రేకెత్తించాయి. ఇదే పని కన్జర్వేటివ్ నేతలు చేయలేకపోయారు. ఫలితంగా మెజారిటీకి కేవలం మూడు సీట్లు తక్కువగా 169 సీట్లు గెలుచుకుని లిబరల్ పార్టీ తిరిగి అధికారాన్ని చేజిక్కించుకుంది. మూడు నెలల ముందు కార్నీ కేవలం మాజీ సెంట్రల్ బ్యాంకర్ మాత్రమే. రాజకీయాలలో ఎలాంటి అనుభవం లేని ఆయన మూడు నెలలు తిరిగేసరికి ప్రధాని కాబోతున్నారంటే అందుకు పరోక్షంగా డొనాల్డ్ ట్రంప్ కారణమని చెప్పక తప్పదు.

విచిత్రంగా కెనడా ఎన్నికల తర్వాత ఐదు రోజులకు జరిగిన ఆస్ట్రేలియా ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి పునరావృతమైంది. ట్రంప్ సుంకాల విధానమే ఆస్ట్రేలియా లోనూ అధికార లిబరల్ పార్టీకి మరొకసారి అందలం కట్టబెట్టేందుకు పరోక్షంగా కారణమైంది. కెనడాపై ట్రంప్ పది శాతం సుంకాలు విధించారు. అమెరికా వైఖరిని అప్పట్లోనే ప్రధాని అల్బనీస్ తీవ్రంగా ఖండించారు. కాగా, ట్రంప్ బాటలో నడుస్తానని, ప్రభుత్వ వ్యయంలో కోత విధించి, ఉద్యోగాల సంఖ్య కుదిస్తానని ప్రకటించిన విపక్ష లిబరల్ నేషనల్ పార్టీ అగ్రనేత పీటర్ క్రెయిగ్ డటన్ ఎన్నికల్లో బొక్కబోర్లా పడగా, ఎవరినీ అనుసరించబోమనీ, విలువలకు అనుగుణంగానే పాలన కొనసాగిస్తానని నమ్మబలికిన ప్రస్తుత ప్రధాని అల్బనీస్ మరోసారి లిబరల్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు. గత రెండు దశాబ్దాలలో ఆస్ట్రేలియాలో రెండోసారి ఎన్నికల్లో గెలిచిన తొలి ప్రధానిగా ఆయన రికార్డు సృష్టించారు. వాస్తవానికి ట్రంప్ ప్రమాణ స్వీకారానికి ముందువరకూ ఆస్ట్రేలియాలో ఈసారి విపక్ష కన్జర్వేటివ్ పార్టీదే విజయమని అందరూ ఊహించారు. కానీ కెనడాలో మాదిరిగానే ఇక్కడ కూడా ఈ మూడు నెలల్లోనే పరిస్థితులు మారి, అధికార పార్టీవైపు జనం మొగ్గు చూపడం విచిత్రం.

ఇరు దేశాల్లోనూ విపక్ష నేతలు ట్రంప్ విధానాలకు వత్తాసు పలికి, పరాజయాన్ని మూటగట్టుకోగా, ట్రంప్ విధానాలను ఎండగట్టడం ద్వారా అధికార పార్టీలు లాభపడ్డాయని చెప్పవచ్చు. ఇరు దేశాల్లోనూ ట్రంప్ సుంకాల బెదిరింపుల పట్ల యువ ఓటర్లలో తీవ్ర వ్యతిరేకత కనిపించడం మరో ముఖ్యమైన విషయం. ప్రపంచ దేశాలలో అమెరికా పట్ల పెరుగుతున్న వ్యతిరేకతకు తాజాగా జరిగిన కెనడా, ఆస్ట్రేలియా ఎన్నికలే ఉదాహరణ. భవిష్యత్తులోనూ ఇలాంటి ఫలితాలే మరిన్ని దేశాలలోనూ ద్యోతకమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్ సహా ఇతర ఆసియా దేశాలను కలుపుకుని అమెరికాకు దీటుగా వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకునే ప్రయత్నాలను చైనా మొదలుపెట్టడం గమనార్హం. శత్రువుకు శత్రువు మనకు మిత్రుడనే నానుడి అమెరికా విషయంలో నిజమవుతోంది%ొ౫% అదే విచిత్రం!

## దేశానికి తెలంగాణ ఆర్ టిసి రోల్ మోడల్: పొన్నం



కరీంనగర్: గత ప్రభుత్వం ఆర్టిసినీ నిర్వీర్యం చేస్తే తాము ఆర్టిసిని నిలబెట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్ టిసికి ప్రతి నెల ప్రభుత్వం 330 కోట్లు చెల్లిస్తుందని వెల్లడించారు. దుద్దేడ టోల్ గేట్ నుండి సిద్దిపేట కలెక్టరేట్ వరకు కరీంనగర్ డిపో ఆర్టీసీ బస్సు లో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రయాణం చేశారు ఆర్ టిసి బస్సులో ప్రయాణం చేసి తమ సమస్యలు అడిగి తెలుసుకోవడంపై ప్రయాణికుల హర్షం వ్యక్తం చేశారు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో పొన్నం ముచ్చటించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మహా లక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టిసిలో అందుతున్న ఉచిత ప్రయాణంపై ఆరా తీశారు. ఉచిత ప్రయాణంపై మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళా ప్రయాణికులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కరీంనగర్ డిపో కి చెందిన ఎక్స్ ప్రెస్ బస్సులో చాలా వరకు మహిళా ప్రయాణికులు ఉండడంతో మహా లక్ష్మి పథకాన్ని మహిళా ప్రయాణికులు చాలా బాగా ఉపయోగించుకుంటున్నారని కొనియాడారు. ఆర్టిసి కొత్త బస్సులు కొనుగోలు చేశామని దేశానికి తెలంగాణ ఆర్ టిసి రోల్ మోడల్ గా నిలుస్తుందని పొన్నం మెచ్చుకున్నారు. తమకు బస్సులో ఉచిత ప్రయాణం వల్ల చాలా డబ్బులు ఆదా అవుతున్నాయని, రాష్ట్రంలో ఎక్కడికి వెళ్ళాలన్న ఉచితంగా ప్రయాణం చేస్తున్నామని మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేశారన్నారు. విద్యార్థులతో మాట్లాడారని, బాగా చదువుకోవాలని సూచించారు. ఆర్టిసి డ్రైవర్, కండక్టర్ తో మాట్లాడి, ఆర్టిసి సమస్యలు పరిష్కారం చేస్తామని పొన్నం హామీ ఇచ్చారు. నిన్న జెఎసి నాయకులతో జరిగిన సమావేశంలో కూడా చెప్పామని, సమ్మెపై వెనక్కి తగ్గి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూసినందుకు ఆర్ టిసి ఉద్యోగులకు పొన్నం ధన్యవాదాలు తెలిపారు.

## అందుకే ఎల్ఇటి క్యాంపుపై తొలి దాడి చేశాం: రక్షణ శాఖ



ఢిల్లీ: ఉగ్రవాదులకు పాకిస్తాన్ అండగా నిలుస్తుందని విదేశాంగ సెక్రటరీ విక్రమ్ మిస్రీ తెలిపారు. ఏప్రిల్ 22న పహల్గామ్ లో భారత పర్యటకులపై ఉగ్రదాడి జరిగిందని, ఈ దాడిలో 26 మంది కన్నుమూశారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ పై భారత విదేశాంగ శాఖ, రక్షణ శాఖ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ ఉగ్రదాడి వెనుక లాష్కరే తోయిబా కుట్ర ఉందని మండిపడ్డారు. లాష్కరే తోయిబా అనుబంధ సంస్థ టిఆర్ఎఫ్ ఈ దాడి చేసిందని విక్రమ్ స్పష్టం చేశారు. దాడి చేశామని సోషల్ మీడియాలో టిఆర్ఎఫ్ ప్రకటించిందన్నారు. ఉగ్రవాదులకు పాకిస్తాన్ అండగా నిలువడంతో ఆ దేశంపై దౌత్య, వాణిజ్య పరమైన ఆంక్షలు విధించామన్నారు. చాలా కాలం నుంచి పాకిస్తాన్ ఉగ్రవాదులను ప్రోత్సహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్మూ కశ్మీర్ లో అభివృద్ధిని అడ్డుకునేందుకే ఉగ్రదాడి జరిగిందని, కశ్మీర్ ఆర్థికాభివృద్ధిని అడ్డుకునేందుకు తీవ్రవాదులు దాడి చేశారని మిస్రీ పేర్కొన్నారు. నియంత్రణ రేఖ నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముజఫరాబాద్ లోని ఎల్ఇటి క్యాంపుపై తొలి దాడి చేశామని రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. ఎల్ఓసిలోని బింబల్ క్యాంపులో దాడి చేశామని, ఇక్కడే లాష్కరే తోయిబా ఉగ్రవాదులకు ట్రైనింగ్ దుయ్యబట్టారు. పాకిస్తాన్ లోని సర్జల్ క్యాంపుపై దాడి చేశామని, సర్జల్ క్యాంప్ ఎల్ఓసికి 8 కిలోమీటర్ల దూరంలో ఉందని, మురిద్కే క్యాంపుపై దాడి చేశామని, ఇక్కడ నుంచి ముంబై పేలుళ్లకు ప్లాన్ చేశారని, కసబ్ ఇక్కడే ట్రైనింగ్ తీసుకున్నారని రక్షణ శాఖ అధికారులు వివరించారు. జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్ చేశారు. సరిహద్దులో భద్రతపై ఒబర్ అబ్దుల్లాతో అమిత్ షా చర్చించారు. ప్రజల కోసం అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పహల్గమ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకొని భారత వాయు సైన్యం బాంబులతో దాడి చేయడంతో వంద మంది తీవ్రవాదులు హతమైనట్టు సమాచారం.

## నగరంలో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్



హైదరాబాద్: పహల్గామ్‌లో ఉగ్రవాదులు సృష్టించిన మారణకాండకు భారత సైన్యం బుధవారం రాత్రి ప్రతీకారం తీర్చుకున్న విషయం తెలిసిందే. ఆపరేషన్ సింధూర్ పేరుతో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. అయితే భారత్‌లో కూడా ప్రతిదాడి జరిగే అవకాశం ఉంది కాబట్టి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని రాష్ట్రాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించాలని కేంద్రం సూచించింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 259 ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ జరిగాయి. ఈ నేపథ్యంలో మరికాసేపట్లో హైదరాబాద్‌లో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ జరగనుంది. వైమానిక దాడులపై ప్రజల్లో అవగాహన కల్పించేలా మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 4.30 గంటల వరకూ మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు పోలీస్ సైరన్, ఇండస్ట్రియల్ సైరన్లు మోగనున్నాయి. సైరన్లు మోగినప్పుడు ప్రజలంతా ఇండ్లల్లోనే ఉండాలని, రోడ్లపై ఉన్నవాళ్లు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. 1971 పాక్‌తో యుద్ధం జరిగినప్పుడు దేశవ్యాప్తంగా.. 1962లో చైనాతో యుద్ధం జరిగినప్పుడు అసోంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు.

## ఆపరేషన్ సిందూర్.. రాష్ట్రపతితో ప్రధాని మోడీ భేటీ



న్యూఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ఆర్మీ చేపట్టి ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి రాష్ట్రపతికి ప్రధాని వివరించారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్ వేదికగా వెల్లడించింది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సాయుధ దళాలు జరిపిన ఖచ్చితమైన దాడుల గురించి తాజా సమాచారం అందించడానికి ప్రధాని మోడీ, రాష్ట్రపతి భవన్‌లో ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. "ప్రధాని, రాష్ట్రపతిని కలిసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు" అని ఎక్స్ లో పోస్ట్ చేస్తూ.. ప్రధాని, రాష్ట్రపతి సమావేశమైన ఫోటోలను పంచుకుంది. కాగా, పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలైన లష్కరే తోయిబా,జైషే మొహమ్మద్ ప్రధాన కార్యాలయాలు, శిక్షణా కేంద్రాలు సహా తొమ్మిది ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని భారత ఆర్మీ దాడులు చేసింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత ఆర్మీ మిస్సైల్స్ తో బుధవారం తెల్లవారుజామున ఉగ్రస్తావరాలపై విరుచుకుపడింది. ఈ దాడుల్లో భారీగా ఉగ్రవాదులు మరణించినట్లు తెలుస్తోంది.

# యుద్ధం ఎవరికైనా వినాశ హేతువే!



విషయంలో ఉన్మత్తమే దాని ప్రధాన ఆచరణ అని అర్థం అయింది? ఈ పహల్గాం దాడికంటే ముందు కార్గిల్ యుద్ధం జరిగింది. దీని తర్వాతనే బిజెపి దేశంలో పుంజుకుంది. జమ్మూకశ్మీర్‌లో అయితే ఉగ్రవాదులు, సైన్యం మధ్య దాడులు నిత్యకృత్యం. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన దాడుల్లో బాలాకోట్, పుల్వామా దాడులు దారుణమైనవి. అవన్నీ దేశంలో బిజెపి బలం పుంజుకోవడానికి, ప్రతిపక్షాలు డిఫెన్స్‌లో పడడానికి రాజకీయ ఆయుధాలుగా మారాయి. గతంలో దాడులు సమయంలో సర్జికల్ స్ట్రైకింగ్‌తో సరిపెట్టు కున్నాం. పహల్గాం దాడి తర్వాత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాకిస్తాన్‌తో అమీతుమీ తేల్చుకుందాం అనే విధంగా ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా ప్రకటనలు ఉన్నాయి. అందుకనుగుణంగా దౌత్యయుద్ధం మొదలైంది. ఇరుదేశాల దౌత్యవేత్తలు, పౌరులు ఆయా దేశాలకు వెళ్ళిపోవాలనేది దాని సారాంశం! అంతేకాదు ఇరుదేశాలు సైనికులు సెలవులు రద్దుచేసి సరిహద్దులకు తరలిస్తున్నారు. అదే సమయంలో సింధూ జలాలు పాకిస్తాన్‌కు వదిలేది లేదని, మరో నది నుండి ఒక్కసారే ప్రాజెక్టు నీళ్ళ వరదలా వెళ్ళేలా చేయడం ఇవన్నీ ప్రచ్ఛన్న యుద్ధంలో భాగం కావచ్చును. కానీ, ఇరుదేశాల ప్రచ్ఛన్న యుద్ధంలో నష్టపోయేది అంటూ, ఇటూ సామాన్య ప్రజలే? అయితే, మన బలగాలు అరేబియా సముద్రంలో క్షిపణి పరీక్షలు జరపడంతో, పాకిస్తాన్ మంత్రి హనీఫ్ అబ్బాస్ 130 అణ్వాయుధాలు ఎక్కుపెట్టి ఉన్నామని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇవన్నీ కూడా ఇరుదేశాలు ఆయుధ పాటవం చూపి ఒకరినొకరు రెచ్చగొట్టుకోవడానికి పనికి వస్తాయి. యుద్ధం ప్రచారానికి బాగానే ఉంటుంది కానీ, అది ఇరుదేశాల సామాన్యుల జీవనసారం లాగేస్తుంది. ఇప్పుడు జరిగే యుద్ధాలేవీ రాజుల కాలంనాటి కత్తుల యుద్ధాలు కావు. ఆ రోజుల్లో బలమైన వాడు రెండు దెబ్బలు కొడితే, బలహీనమైనవాడు ఒక్క దెబ్బనైనా కొట్టేవాడు. కాని, నేడు ఆధునిక కాలం మారణాయుధాలతో పాటు కూటముల ప్రాధాన్యత ఉంటుంది. యుద్ధం ప్రారంభించడం తేలికే, ఆధునిక కాలంలో దాని ముగింపు యుద్ధం మొదలెట్టిన వారి చేతిలో ఉండదు. యుద్ధం గురించి వాగాడంబరాలు పలకడం ఎవరికైనా తేలికనే. కానీ,

పహల్గాంలో ఉగ్రవాదుల అమానుష హత్యాకాండ తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య ఓ రకమైన ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. ఈ రెండు దేశాల మధ్య దౌత్యపరమైన యుద్ధంతో మొదలై రెండు దేశాల మధ్య సరిహద్దుల్లో ఉద్రిక్తతలు వరకు దారితీసింది. పాకిస్తాన్ రాజకీయాల్లో పెరుగుతున్న అస్థిరత మూలంగా అంతర్గత, సీమాంతర ఉగ్రవాదం పెరిగిపోయింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత మన దేశం సోషల్ మీడియా మరింత ఉన్మాదంతో రగిలిపోతుంది. అది కొన్ని రాజకీయ పక్షాల లక్ష్యం అయి వుండవచ్చునేమో? కానీ, అది అత్యంత ప్రమాదకరం! పహల్గాం దాడి తర్వాత భారత్ పాకిస్తాన్ దేశాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధానికి ప్రధాన కారణం రెండు ప్రభుత్వాలు ఆయా మత ఆధిక్య రాజకీయాలు కలిగి ఉండడం. పహల్గాం దాడి ఎలా జరిగింది? ఎవరు చేశారు? వారిని ఎలా శిక్షించాలి? అనే అంశాలు కశ్మీర్ పోలీసు వ్యవస్థ, కేంద్ర బలగాలపై అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చూసుకుంటుంది. పహల్గాం దాడి తర్వాత బాధితుల ఇంటర్వ్యూలు అనేకం వచ్చాయి. వాటిలో రెండు పార్శ్వాలు ఉన్నాయి. ఒక మతం వారినే గుర్తించి చంపారనేది ఒక పార్శ్వం అయితే! కశ్మీరీ ముస్లింలు అనేక మంది తమను కాపాడారని చెప్పిన పార్శ్వం రెండవది. ఈ రెండు నిజాలే! ఒకటి మతోన్మాదానికి ప్రతీక అయితే, మరొకటి మత సామరస్యానికి గుర్తు! అయితే అదే సమయంలో పహల్గాంలో ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారిలో హిందువులతో పాటు ముస్లీం పేదలు ఉన్నారు. దీన్ని బట్టి ఉగ్రవాదానికి, దాని చర్యలకు మతం కవచమే కానీ, చర్యలు

ఆ యుద్ధం చేయాల్సిన ఇరువైపుల సైనికులు, వారి కుటుంబాలు దినదిన గండంగా బతుకులు, నిత్యం, క్షణక్షణం మనోవేదనతో యుద్ధం అనివార్యం అవుతుంది. మనిషి మనిషిగా శాంతిగా జీవించవలసిన మనిషి అకాల మృత్యువును ఆహ్వానించేదే యుద్ధం. ఆత్మగౌరవం పేరుతో, మత ఉగ్రవాదాల పేరుతో ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలు, మారణహోమం చూసిన తర్వాత ఇరుదేశాలు సంయమనం కోల్పోవడం సరికాదు! యుద్ధం మిత్రుడు మిత్రుడు శత్రువు, శత్రువు శత్రువు మిత్రుడు లాంటి ఎన్నో విషయాలను ముందుకు తెస్తుంది. ఇప్పుడు ఇండియాకు ఇరుగుపొరుగు దేశాలతో పెద్ద సఖ్యత లేదు? పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్ ఇలా అన్ని మనకు వ్యతిరేక సంకేతాలే? ఇంకా యుద్ధం ప్రక్కనే ఆయుధం వ్యాపారం ఉంటుంది. బేరసారాలు ఉంటాయి. ప్రజల క్షేమం కోసం వెచ్చించాల్సిన నిధులు దారితప్పడం వలన ద్రవ్యోల్బణం పొంచి ఉంటుంది. నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందనంత స్థాయికి పెరిగిపోతాయి. అది ఒక రకమైన నరకమే? ఇకపోతే ఆధునిక యుద్ధాలు చూద్దాం. ఒకనాడు అమెరికాతో ఢీ అంటే ఢీ అన్న, ప్రచ్ఛన్న యుద్ధం జరిపిన రష్యాతో ఉక్రెయిన్ ప్రారంభించిన యుద్ధం ముగింపు కనపడడం లేదు? ఇక ఇజ్రాయెల్ -పాలస్తీనా మధ్య దశాబ్దాల వైరం ఉంది. హమాస్ సంస్థ ఉనికితో మొదలైన యుద్ధం గాజా గజగజా వణుకుతున్నది. పసిపిల్లల మరణాలు, అవయవాలు తెగిపడుతున్న అమానవీయ దృశ్యాలు నిత్యం చూస్తూనే ఉన్నాం. అమెరికా, రష్యా ప్రచ్ఛన్న యుద్ధం తర్వాత అమెరికాలో సెప్టెంబర్ 11న ప్రపంచ వాణిజ్య భవనాలుపై ఉగ్రదాడి తర్వాత అమెరికా దూకుడుగా ఏకధ్రువ ఆధిపత్యంతో ముందుకు వచ్చింది. పాకిస్తాన్ సహకారంతో అఫ్ఘనిస్తాన్‌లో ముల్లా ఒమర్ ప్రభుత్వాన్ని దించేసింది. కువైట్ చమురు బావి వివాదంతో మొదలైన ఇరాక్ యుద్ధంలో రసాయనిక ఆయుధాల నెపంతో ప్రపంచంలో నెంబర్ వన్‌గా ఉన్న అమెరికా సద్దాం హుస్సేన్ రిపబ్లికన్ గార్డులను ఓడించింది. ఎప్పుడు అమెరికా వెన్నంటి ఉండే పాశ్చాత్య దేశాలు అమెరికాను కాదని ఉక్రెయిన్‌కు ఇచ్చిన భరోసా చూశాం. ఇవన్నీ ఆధునిక ప్రపంచంలో యుద్ధాల్లో మొదలైన తాజా పరిణామాలు. కొన్ని బలహీన క్షణాల్లో యుద్ధాలకు దిగిన పాలకులు వెనక్కి రాలేక పతనం అవుతున్న స్థితి చూస్తున్నాం. ఇక రెండు ప్రపంచ యుద్ధాలు తర్వాత భయంకరమైన కరువు పరిస్థితి చూశాం. ఇప్పటికే పాకిస్తాన్‌లో కాస్తా ఎక్కువగా, మన దేశంలో కాస్తా తక్కువగా ధరలు పెరుగుదల ప్రజలకు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. స్వేచ్ఛగా, శాంతితో జీవించవలసిన ప్రజలు యుద్ధం వలన వచ్చే కృత్రిమ ఉపద్రవాలను చవిచూడాల్సి వస్తుంది. కనుక ఇప్పుడు మన దేశం, పాకిస్తాన్ యుద్ధ పరిణామాలు దృష్టిలో పెట్టుకొని అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. దౌత్యం, లౌక్యంతో మెలిగే పాలకులే ఇప్పుడు ప్రపంచానికి, ప్రజలకు అవసరం.

# ముందడుగు వేయని 'స్టార్టప్'





పరిశ్రమ డేటా వెల్లడిస్తుంది. ఈ వైఫల్యాల మూల కారణాలపై ఇటీవల లోతైన పరిశోధన క్లిష్టమైన సర్వే, నిజ నిర్ధారణ కమిటీలు, నిర్లక్ష్యం చేయబడిన ప్రాథమికాలను వెల్లడిస్తుంది. ఉత్పత్తి మార్కెట్ ఫిట్ లేకపోవడం, అనేక స్టార్టప్‌లు తమ సమర్పణలను నిజమైన మార్కెట్ అవసరాలకు సమలేఖనం చేయడంలో విఫలమవుతాయి. వినూత్న ఆలోచనలు తరచుగా తమ సమయానికి చాలా ముందుండటం లేదా లక్ష్య జనాభాకు అసంబద్ధంగా ఉండటం ద్వారా మార్క్‌ను కోల్పోతాయి. పేలవమైన ఆర్థిక ప్రణాళిక, అసమర్థమైన నగదు ప్రవాహ నిర్వహణ, ప్రారంభ దశ ఆదాయ అంచనాలలో అతిగా చూపించడం, ఆశావాదం స్థిరమైన కార్యకలాపాలకు దారితీస్తాయి. అసమర్థ నాయకత్వం, కోర్ టీంలో సఖ్యత లేకపోవడం, ఆలోచనల్లో సారూప్యత లేకపోవడం, బృంద సంఘర్షణలు, వ్యవస్థాపకులు తరచుగా నిర్ణయం తీసుకోవడంలో ఇబ్బందిపడుతున్నారు. స్టార్టప్ ప్రధాన భాగాన్ని బలహీనపరుస్తున్నారు. తగినంత నిధులు లేకపోవడం లేదా తప్పుదారి పట్టించడం, స్టార్టప్‌లు తగినంత మూలధనాన్ని సేకరించడం లేదా నిధులను దుర్వినియోగం చేయడం వలన అకాల స్కేలింగ్ లేదా కార్యాచరణ విచ్ఛిన్నం సంభవిస్తాయి. బలహీనమైన మార్కెటింగ్, కస్టమర్ సముపార్జన వ్యూహా లు, బలమైన బ్రాండింగ్, లక్షిత ప్రచారం లేకుండా అనేక స్టార్టప్‌లు పోటీ మార్కెట్లలో పట్టు సాధించడంలో విఫలమవుతాయి. నియంత్రణ, సమ్మతి సవాళ్లు, నిపుణుల మార్గదర్శకత్వం లేకుండా భారతదేశం సంక్లిష్టమైన చట్టపరమైన దృశ్యాన్ని నావిగేట్ చేయడం తరచుగా వైఫల్యాలకు దారితీస్తుంది. సాంకేతికత ఉత్పత్తి, అభివృద్ధి సమస్యలు, సాంకేతిక నైపుణ్యం లేకపోవడం, పేలవమైన స్కేలబిలిటీ తరచుగా

భారతదేశంలో అధిక శాతం మంది స్వయం ఉపాధి రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఇది ప్రపంచంలోనే అత్యధికమని ఐఎస్ఒ నివేదించింది. ఒకరి మీద ఆధారపడకుండా స్వయం ఉపాధి చూసుకోవాలి అని మన నేతలు నిత్యం చేసే ప్రచారాన్ని చూసి ఇది మంచిది అని అనుకోడానికి లేదు. ఎందుకంటే భారతదేశంలో ముఖ్యంగా స్వయం ఉపాధి రంగం దారుణంగా ఉంది. స్వయం ఉపాధి రంగం లో స్థిరపడాలనుకునే వారికి ప్రోత్సాహం ఉండదు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ వ్యవస్థలలో భారతదేశం అగ్రగామిగా ఉండేది. ప్రతి సంవత్సరం వేలాది కొత్త ఆలోచనలతో, వెంచర్లు, ప్రణాళికలు ఉద్భవిస్తున్నాయి. స్టార్టప్ ఇండియా వంటి ప్రభుత్వ చొరవతో ప్రోత్సహించబడిన సహాయక వాతావరణం ఉన్నప్పటికీ, అద్భుతమైన సంఖ్యలో స్టార్టప్‌లు ఒకటి రెండు సంవత్సరాలకు మించి మనుగడ సాగించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయి. దాదాపు 80% - 90% భారతీయ స్టార్టప్‌లు మొదటి ఐదు సంవత్సరాలలోపు మూసివేయబడుతున్నాయని. 8 శాతం మాత్రమే దశాబ్దం దాటి మనుగడ సాగిస్తున్నాయి అని

ఉత్పత్తి విశ్వసనీయతను అలాగే వినియోగదారు సంతృప్తిని దెబ్బతీస్తాయి. సరికాని స్కేలింగ్ వ్యూహాలు, స్థిరమైన కార్యాచరణ పునాది లేకుండా చాలా వేగంగా లేదా చాలా నెమ్మదిగా స్కేలింగ్ చేయడం వల్ల అవకాశాలు లేదా ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తుంది. కస్టమర్ ఫీడ్ బ్యాక్‌ను నిర్లక్ష్యం చేయడం, వినియోగదారు ఇన్‌పుట్‌ను విస్మరించడం, ఫీడ్ బ్యాక్ ఆధారంగా పునరావృతం చేయడంలో విఫలమవడం నిష్క్రమణ, గందరగోళానికి దారితీస్తుంది. తీవ్రమైన మార్కెట్ పోటీ, తమను తాము వేరు చేసుకోలేని స్టార్టప్‌లు బాగా నిధులు సమకూర్చుకున్న లేదా మరింత వినూత్నమైన పోటీదారులకు నష్టపోతాయి. పేలవమైన నియామకం, బృంద నిర్మాణం, బలహీనమైన టీం డైనమిక్స్, అస్పష్టమైన పాత్రలు తక్కువ ధైర్యం, అసమర్థతకు దారితీస్తాయి. మార్కెట్ సామర్థ్యాన్ని తప్పుగా అంచనా వేయడం, సమగ్ర పరిశోధన లేకుండా అతిగా సంతృప్త లేదా తక్కువ డిమాండ్ ఉన్న మార్కెట్లలోకి ప్రవేశించడం వల్ల పనితీరు తగ్గడం వలన నిష్క్రమణ జరుగుతుంది. భారతదేశం ఫ్లిప్‌కార్ట్, జొమాటో, పెటిఎం వంటి యునికార్న్‌ల విజయగాథలు ఉన్నప్పటికీ అధిక వైఫల్య రేటు వాస్తవిక ప్రణాళిక, క్రమశిక్షణతో కూడిన అమలు, నిరంతర మార్కెట్ తక్షణ అవసరాన్ని హైలైట్ చేస్తుంది. ఔత్సాహిక వ్యవస్థాపకులకు సందేశం స్పష్టంగా ఉంది. ఆవిష్కరణ మార్కెట్ వాస్తవాలపై ఆధారపడి ఉండాలి. బలమైన నాయకత్వం ద్వారా మద్దతు ఇవ్వాలి. అలాగే దృఢమైన ఆర్థిక కార్యాచరణ వ్యూహాలపై నిర్మించబడాలి. స్వభావ రీత్యా భారతీయులు రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడనివారు, స్వార్థపరులు, దురాశపరులు. ఇలాంటి లక్షణాలు కొత్త వెంచర్‌కు అసురక్షిత వాతావరణాన్ని సృష్టిస్తాయి. వాస్తవానికి బ్యాంకులు, ప్రైవేట్ పెట్టుబడిదారుల నుంచి నిధులు పొందడం ఒక సమస్య. ప్రభుత్వ మద్దతు కేవలం ప్రచారం తప్ప ఆచరణలో శూన్యం. కొత్త ఆలోచనలు ప్రోత్సహించడానికి ఎటువంటి వ్యవస్థ లేదు. భారతీయ ప్రజలు కొత్త ఉత్పత్తులను అంగీకరించరు. స్టార్టప్‌ల వైపు నుండి, ఇందులో పాల్గొన్న వ్యక్తులు వారు అందించే దానికంటే డబ్బుపై ఎక్కువ శ్రద్ధ వహిస్తారు. పని ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉండదు. పని సంస్కృతి చెత్తగా ఉంటుంది, కంపెనీ పట్ల విధేయత లేదు. వ్యవస్థాపకుడు ఉద్యోగుల పట్ల, ఉద్యోగులు యజమాని పట్ల విధేయత చూపరు. క్లుప్తంగా చెప్పాలంటే, భారతదేశానికి మెదడు లేదు, శక్తి లేదు, పర్యావరణం లేదు లేదా కొత్త ఆలోచనలను పెంపొందించడానికి వాటిని లాభదాయక వ్యాపారాలుగా మార్చడానికి డబ్బు లేదు.

# ట్రంప్ దెబ్బకు ఫలితాలు తారుమారు



ట్రంప్ దురుసు వ్యాఖ్యల ప్రభావం అమెరికాపై మాత్రమే కాదు, ఇతర దేశాల మీద కూడా కనబడుతోంది. తాజాగా జరిగిన కెనడా, ఆస్ట్రేలియా ఎన్నికలను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కెనడా పార్లమెంటు ఎన్నికల్లో లిబరల్ పార్టీ తిరిగి అధికారాన్ని చేజిక్కించుకుంటుందని ఎవరూ కలలో కూడా ఊహించలేదు. ఎందుకంటే, ఇటీవలే పదవినుంచి దిగిపోయిన జస్టిన్ ట్రూడో ఆ పార్టీకి చేసిన నష్టం అంతాఇంతా కాదు. కోరి ఇండియాతో కయ్యానికి కాలు దువ్వి, సిక్కు ఉగ్రవాదులకు వత్తాసు పలుకుతూ స్వజాతీయులైన కెనడియన్లలో కావలసినంత అప్రదిష్టను మూటగట్టుకున్నారు. జనవరి తొలివారంలో ఆయన రాజీనామా చేసేనాటికి విపక్ష కన్జర్వేటివ్ పార్టీకంటే అధికార లిబరల్ పార్టీ 20 పాయింట్లు వెనకబడి ఉంది. జనవరి మూడో వారంలో ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశాక, కెనడాలో వెంటవెంటనే మార్పు లు చోటుచేసుకున్నాయి. ఇరుగుపొరుగు దేశాలతో స్నేహభావంతో మెలగాలనే ఇంగితం లేని అగ్రరాజ్యాధినేత కెనడా, మెక్సికో వంటి దేశాలతో తెగతెంపులు చేసుకునేందుకే ప్రయత్నించారు. అది చాలదన్నట్లు కెనడియన్ల మనోభావాలు దెబ్బతినేలా వాచాలత్వం ప్రదర్శించారు. కెనడాపై అధిక సుంకాలు విధించడమే కాదు. అమెరికాలో కెనడా 51వ రాష్ట్రం అవుతుందంటూ పదేపదే ఆయన చేసిన వ్యాఖ్యలు కెనడియన్లలో జాతీయ భావాన్ని రెచ్చగొట్టాయి. తమ ఉనికినే ప్రశ్నించేలా ట్రంప్ మహాశయుడు చేస్తున్న వ్యాఖ్యలు వారిని ఒక్కతాటిపై నిలిచేలా చేశాయి. అదే సమయంలో లిబరల్ పార్టీ పగ్గాలు చేపట్టిన మార్క్ కార్నీ ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకోవడంలో నూటికి నూరు శాతం విజయం సాధించారు. ట్రంప్‌ను తీవ్రంగా వ్యతిరేకించడం ద్వారా, ఎన్నికల సభలలో ట్రంప్ వ్యాఖ్యలను ఎండగట్టడం ద్వారా మెజారిటీ ఓటర్ల మనసు గెలుచుకున్నారు.

మన దేశాన్ని విచ్ఛిన్నం చేయడం ద్వారా తన అధీనంలోకి తెచ్చుకునేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారంటూ ఆయన చేసిన ఎన్నికల ప్రసంగాలు ఓటర్లలో ఆలోచన రేకెత్తించాయి. ఇదే పని కన్జర్వేటివ్ నేతలు చేయలేకపోయారు. ఫలితంగా మెజారిటీకి కేవలం మూడు సీట్లు తక్కువగా 169 సీట్లు గెలుచుకుని లిబరల్ పార్టీ తిరిగి అధికారాన్ని చేజిక్కించుకుంది. మూడు నెలల ముందు కార్నీ కేవలం మాజీ సెంట్రల్ బ్యాంకర్ మాత్రమే. రాజకీయాలలో ఎలాంటి అనుభవం లేని ఆయన మూడు నెలలు తిరిగేసరికి ప్రధాని కాబోతున్నారంటే అందుకు పరోక్షంగా డొనాల్డ్ ట్రంప్ కారణమని చెప్పక తప్పదు. విచిత్రంగా కెనడా ఎన్నికల తర్వాత ఐదు రోజులకు జరిగిన ఆస్ట్రేలియా ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి పునరావృతమైంది. ట్రంప్ సుంకాల విధానమే ఆస్ట్రేలియా లోనూ అధికార లిబరల్ పార్టీకి మరొకసారి అందలం కట్టబెట్టేందుకు పరోక్షంగా కారణమైంది. కెనడాపై ట్రంప్ పది శాతం సుంకాలు విధించారు. అమెరికా వైఖరిని అప్పట్లోనే ప్రధాని అల్బనీస్ తీవ్రంగా ఖండించారు. కాగా, ట్రంప్ బాటలో నడుస్తానని, ప్రభుత్వ వ్యయంలో కోత విధించి, ఉద్యోగాల సంఖ్య కుదిస్తానని ప్రకటించిన విపక్ష లిబరల్ నేషనల్ పార్టీ అగ్రనేత పీటర్ క్రెయిగ్ డటన్ ఎన్నికల్లో బొక్కబోర్లా పడగా, ఎవరినీ అనుసరించబోమనీ, విలువలకు అనుగుణంగానే పాలన కొనసాగిస్తానని నమ్మబలికిన ప్రస్తుత ప్రధాని అల్బనీస్ మరోసారి లిబరల్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు. గత రెండు దశాబ్దాలలో ఆస్ట్రేలియాలో రెండోసారి ఎన్నికల్లో గెలిచిన తొలి ప్రధానిగా ఆయన రికార్డు సృష్టించారు. వాస్తవానికి ట్రంప్ ప్రమాణ స్వీకారానికి ముందువరకూ ఆస్ట్రేలియాలో ఈసారి విపక్ష కన్జర్వేటివ్ పార్టీదే విజయమని అందరూ ఊహించారు. కానీ కెనడాలో మాదిరిగానే ఇక్కడ కూడా ఈ మూడు నెలల్లోనే పరిస్థితులు మారి, అధికార పార్టీవైపు జనం మొగ్గు చూపడం విచిత్రం. ఇరు దేశాల్లోనూ విపక్ష నేతలు ట్రంప్ విధానాలకు వత్తాసు పలికి, పరాజయాన్ని మూటగట్టుకోగా, ట్రంప్ విధానాలను ఎండగట్టడం ద్వారా అధికార పార్టీలు లాభపడ్డాయని చెప్పవచ్చు. ఇరు దేశాల్లోనూ ట్రంప్ సుంకాల బెదిరింపుల పట్ల యువ ఓటర్లలో తీవ్ర వ్యతిరేకత కనిపించడం మరో ముఖ్యమైన విషయం. ప్రపంచ దేశాలలో అమెరికా పట్ల పెరుగుతున్న వ్యతిరేకతకు తాజాగా జరిగిన కెనడా, ఆస్ట్రేలియా ఎన్నికలే ఉదాహరణ. భవిష్యత్తులోనూ ఇలాంటి ఫలితాలే మరిన్ని దేశాలలోనూ ద్యోతకమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్ సహా ఇతర ఆసియా దేశాలను కలుపుకుని అమెరికాకు దీటుగా వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకునే ప్రయత్నాలను చైనా మొదలుపెట్టడం గమనార్హం. శత్రువుకు శత్రువు మనకు మిత్రుడనే నానుడి అమెరికా విషయంలో నిజమవుతోంది.. అదే విచిత్రం!

# యాపిల్ ఎక్స్‌కోడ్‌కు చాట్‌జీపీటీ అనుసంధానం..!




యాపిల్ డబ్ల్యూడబ్ల్యూడీసీ 2025 (వరల్డ్ వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్)లో పలు ఆసక్తికర మార్పులను ప్రకటించింది. దాని ప్రధాన యాప్ బిల్డింగ్ టూల్ ఎక్స్‌కోడ్‌కు చాట్ జీపీటీని అనుసంధానిస్తున్నట్లు వెల్లడించింది. ఫలితంగా కృత్రిమ మేధ సాయంతో కోడ్ రాయడం, బగ్స్‌ను సరిచేయడం, డాక్యుమెంటేషన్, యాప్స్ టెస్టింగ్ వంటివి చేసే అవకాశం లభిస్తుందని పేర్కొంది. ఎక్స్‌కోడ్ 26 అనే సరికొత్త వెర్షన్ తీసుకొచ్చింది. దీనిలో డెవలపర్లు ఇతర ఏఐ మోడల్స్‌ను కూడా ఏపీఐ 'కీ'లను వాడి ప్లగ్ఇన్ చేసుకొనే అవకాశం కల్పించింది. ఇప్పటికే యాపిల్ చిప్స్‌ను వాడుతున్నవారు ఇంటర్నెట్‌పై ఆధారపడకుండా ఏఐ మోడల్స్‌ను ఎటువంటి సమస్య లేకుండా రన్ చేసుకోవచ్చు. తమ పరికరాల యూజర్లు కేవలం మూడు లైన్ల కోడ్‌తో.. యాపిల్ ఏఐ టూల్స్ వాడుకొనేలా ఫౌండేషన్ మోడల్స్ ఫ్రేమ్‌వర్క్‌ను ప్రారంభించింది. ఎక్స్‌కోడ్‌లో చాట్‌జీపీటీని వినియోగించాలంటే ఓపెన్ ఏఐ ఖాతాలోకి సైన్ఇన్ కావాల్సిన అవసరం లేదు. దీంతోపాటు ఎక్స్‌కోడ్‌లో సరికొత్త నేవిగేషన్ సిస్టమ్, మరింత మెరుగైన సపోర్ట్‌తో ట్రాన్స్‌లేటింగ్ యాప్స్, వాయిస్ కంట్రోల్ పనితీరును మెరుగుపర్చింది.

లిక్విడ్ గ్లాస్ పరిచయం..


ఈ కాన్ఫరెన్స్‌లో యాపిల్ తన ఐఫోన్, మ్యాక్, వాచ్‌ల కోసం సరికొత్త లిక్విడ్ గ్లాస్ డిజైన్‌ను పరిచయం చేసింది. తమ ఉత్పత్తులన్నీ ఒకేరకమైన అనుభవం ఇచ్చేందుకు అన్నింట్లో ఒకేసారి డిజైన్ అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొంది. దీంతో ఐవోఎస్, ఐపాడ్ వోఎస్, మ్యాక్ వోఎస్, వాచ్ వోఎస్ ఒకేసారి ఈ మార్పు రానుంది. చివరిసారిగా యాపిల్ డిజైన్ ఐవోఎస్7 సమయంలో జరిగింది. "నేడు మా విస్తృతమైన డిజైన్ అప్‌డేట్‌ను ప్రకటించడానికి చాలా ఉత్సుకతతో ఉన్నాను. అది పూర్తిగా సరికొత్తగా ఉంటుంది. దానికి మేము లిక్విడ్‌గ్లాస్ అని పేరుపెట్టాము. దానికి గాజు, ద్రవాల వంటి పారదర్శకతను యాపిల్ సాధించింది. అది మీ కంటెంట్‌ను బట్టి మారుతుంది. మరింత వినియోగానికి అవసరమైన స్పష్టత, కంట్రోల్స్‌ను అందిస్తుంది" అని యాపిల్ డిజైన్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అలాన్ డై పేర్కొన్నారు.




# జోలపాటే మేలట!



'అమ్మపాడే జోలపాట... అమృతానికన్న తీయనంట...', 'వటపత్ర శాయికి వరహాల లాలి... రాజీవ నేత్రునికి రతనాల లాలి...' అంటూ జోలపాట గొప్పదనాన్ని తెలిపే పాటలు ఎన్నో. కానీ, ఇప్పుడు నిజంగా పాటపాడి బుజ్జాయిలను నిద్రపుచ్చే వాళ్లెందరు? అయితే, కొత్త పద్ధతులు ఎన్ని వచ్చినా జోలపాటకు మించింది లేదంటున్నాయి తాజా యేల్ యూనివర్సిటీ అధ్యయనాలు. శిశువుల మానసిక స్థితిని మెరుగుపరిచే వాటిల్లో ఇదే అత్యంత సురక్షితమైన, తేలికైన పద్ధతనీ చెబుతున్నాయి. పాట పాడి నిద్రపుచ్చడం వల్ల శిశువులతోపాటు, అమ్మానాన్నలు, మిగతా కుటుంబ సభ్యుల జీవన నాణ్యత కూడా మెరుగుపడుతుందట. ఈ పరిశోధన కోసం శాస్త్రవేత్తలు కొందరు తల్లిదండ్రులనీ, 4నెలల కంటే తక్కువ వయసున్న శిశువుల్నీ ఎంచుకున్నారు. వాళ్లని రెండు గ్రూపులుగా విభజించి... ఒక గ్రూప్ వాళ్లను శిశువులకు రోజూ పాట పాడి వినిపించమన్నారు. ఇంకొకరిని మామూలుగా ఉండమన్నారు. ఇలా నాలుగు వారాలపాటూ చేశాక... శిశువుల మూడ్, చిరాకు స్థాయులు, సంగీతానికి ఎలా స్పందిస్తున్నారన్న విషయాలన్నీ సర్వే చేశారు. అందులో సగానికి పైగా తల్లిదండ్రులు వారి శిశువుల మానసిక స్థితి మెరుగుపడినట్లు తెలిపారట. కాబట్టి, ఖరీదుతో కూడిన, క్లిష్టమైన పద్ధతులకంటే 'లాలిపాట' మేలని సూచిస్తున్నారు పరిశోధకులు. మరి మీ బుజ్జాయిని నిద్రపుచ్చడానికి మీరు ఎలాంటి పద్ధతులు పాటిస్తున్నారు?



### మీకు తెలుసా?

శిశువుల చర్మం మీద గులాబీ, ఎరుపు రంగుల్లో పుట్టుమచ్చలు ఏర్పడటం చూస్తుంటాం కదా! ఇవి రక్తనాళాల సమూహాలు విస్తరించడం వల్ల ఏర్పడతాయి. వీటినే 'ఏంజెల్ కిసెస్' అంటారట. సాధారణంగా కనురెప్పలు, ముఖం, నుదురు, పెదవిపై కనిపించే ఈ గుర్తులు కాలక్రమేణా మసకబారతాయట.

# రిచ్ మరింత 'రిచ్'.. పూర్ మరింత 'పూర్'

## అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ త్వరలో ముందడుగు

### జపాన్‌ను వెనక్కి నెట్టి నాలుగో స్థానానికి చేరే అవకాశం




ప్రపంచంలోనే యూఎస్, చైనా, జర్మనీ, జపాన్ తర్వాత ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ దూసుకుపోతోంది. త్వరలో జపాన్‌ను సైతం వెనక్కి నెట్టి నాలుగో స్థానానికి చేరుకుంటోందనే అంచనాలు వెలువడుతున్నాయి. కానీ ప్రజల ఆదాయాలు, వారి సంపద మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. గతంలో ఇటీవల హురున్ ఇండియా దేశంలోని అత్యంత సంపన్నుల జాబితాను విడుదల చేసింది. రూ.1,000 కోట్ల సంపద కలిగిన వారిని పరిగణనలోకి తీసుకుని దీన్ని రూపొందించారు. దాని ప్రకారం దేశంలోని కుబేరుల సంఖ్య ఏడికేడు పెరుగుతోంది. మొత్తం దేశంలో అత్యధిక సంపన్నుల సంఖ్య 1,539కు పైగానే ఉంది. వీరి వద్ద రూ.159 లక్షల కోట్ల కంటే ఎక్కువే సంపద మూలుగుతుంది. ఏడాది ప్రాతిపదికన వీరి ఆస్తులు 46 శాతం వృద్ధి చెందుతున్నాయి. ఇలా కొద్ది మంది వద్దే రూ.లక్షల కోట్లు పోగవ్వడం సామాజిక అంశాతికి దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న ఆర్థిక అసమానతలు

చాలా మంది ఇంటిముందు మురికికాలువ పారుతుంటే టెక్నికల్‌గా ప్రపంచంలోనే టాప్ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ దూసుకుపోతుందని చంకలు చరుచుకోవడం సరికాదని కొందరు అభిప్రాయపడుతున్నారు. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు బ్రిటిష్ కాలంలో కంటే ఇప్పుడు ఎక్కువయ్యాయి. కొన్ని నివేదికల ప్రకారం దేశంలోని ఒక శాతం జనాభా చేతుల్లోకి 40.1 శాతం సంపద మూలుగుతోంది. వివిధ వర్గాల ఆదాయ సంపదల్లో అసమానతలు ఉన్నప్పటికీ, అందరి వాస్తవ ఆదాయాలు క్రమంగా పెరుగుతున్నాయి. అయితే ప్రజల ఆదాయాలతో పాటే వాటి మధ్య అంతరాలు అధికమవుతున్నాయి. అందుకు 1991లో చేపట్టిన ఆర్థిక సంస్కరణలే కారణమని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వీటిని అమలు చేయకముందు వరకు దేశ జీడీపీ మూడు శాతం వద్దే ఆగిపోయింది. ఈ సంస్కరణల తర్వాత జీడీపీ 6-8 శాతం పెరిగింది. అయినా గరిష్ఠ సంపద తక్కువ మంది చేతుల్లోకే వెళుతుంది.

సామాజిక అశాంతి నెలకొనే ప్రమాదం

భారత్‌తోపాటు అనేక దేశాల్లో ఈ ఆర్థిక అసమానతలకు సంబంధించిన సమస్యలు ఎక్కవవుతున్నాయి. ఇవి మరింత పెరిగితే సామాజిక అశాంతి నెలకుంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఈ అంతరాలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అత్యంత ధనవంతులపై విధించే పన్నులు పెంచాలని చెబుతున్నారు. కుబేరులకు వారసత్వంగా వచ్చే సంపదపై పన్ను విధించాలంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు.. ఇందుకు సహకరించాలని కోరుతున్నారు. దురదృష్టవశాత్తు పార్టీలకు అతీతంగా ప్రభుత్వాలను పరోక్షంగా నడిపించేది ధనవంతులే. దాంతో చట్ట సభల్లో ఇలాంటి నిర్ణయాలు తీసుకునే ధైర్యం చేయడానికి ప్రజా ప్రతినిధులు సహకరించడం లేదు. కానీ ఆర్థిక అసమానతల వల్ల భవిష్యత్తులో రాబోయే సామాజిక అశాంతిని దృష్టిలో ఉంచుకుని ఈమేరకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఏం చేయాలంటే..

భారతదేశం 2027 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఆకాంక్షిస్తుంది. అయితే ఇలా కుబేరుల సంఖ్య పెంచుకుంటూ, వారి సంపదను లెక్కల్లో చూపుతూ ఈ ఘనత సాధించడంలో అర్థం లేదు. సామాజిక శైలి, సమగ్ర జీవన ప్రమాణాల్లో మార్పు వస్తూ సంపద సృష్టించగలితేనే మేలు జరుగుతుంది. ఈమేరకు విధానాలను పునఃసమీక్షించాల్సిన అవసరం ఉంది. అటువంటి ప్రయత్నాలు చేయకపోతే కొందరి చేతిల్లోనే సంపద చేరి దేశంలో సామాజిక అశాంతి పెరిగే ప్రమాదం ఉంది.




# బ్లాక్ హెడ్స్‌కు చెక్, ముఖాన్ని మెరిపించే స్క్రబ్స్

ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నప్పటికీ బ్లాక్ హెడ్స్ వస్తూనే ఉంటాయి. వీటివల్ల ముఖం కళావిహీనంగా కనిపిస్తుంది. వీటిని తీయించుకోవడం ఖర్చుతో కూడుకున్నదేగాక, సమయం కూడా వెచ్చించాలి. అయితే ఇంట్లో ఉండే దాల్చినచెక్క, నిమ్మ, పప్పు, పాలు, పంచదార, కొబ్బరి నూనె, ఉప్పుతో సులభంగా తొలగించుకోవచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు.

అవేంటో చూద్దాం... చర్మంలో అతిముఖ్యమైన ప్రొటీన్ కొల్లాజెన్ విడుదలను మెరుగుపరచడంలో దాల్చినచెక్క ప్రముఖ పాత్ర పోషిస్తుంది. చర్మం మీద ఏర్పడే రంధ్రాలను దాల్చిని తగ్గిస్తుంది. నిమ్మరసంలోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మంమీద రంధ్రాలను లోతుగా శుభ్రం చేస్తాయి. అందువల్ల అరచెక్క నిమ్మరసంలో టీస్పూను దాల్చిన చెక్క పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని బ్లాక్‌హెడ్స్ ఉన్న ప్రాంతంలో పూతలా వేసి పదిహేను నిమిషాల పాటు మర్దనా చేయాలి. తరువాత చల్లటి నీటితో కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే బ్లాక్‌హెడ్స్ తగ్గుముఖం పడతాయి. స్పూను పంచదారలో రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెవేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఇరవై నిమిషాలపాటు మర్దన చేసి తరువాత కడిగేయాలి. పంచదార చర్మాన్ని లోతుగా శుభ్రంచేసి మూసుకు పోయిన రంధ్రాలను తెరవడంతో పాటు, మృతకణాలను తొలగిస్తుంది. కొబ్బరి నూనెలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంతోపాటు, మృదువుగా మారుస్తాయి. అరచెక్క నిమ్మరసంలో అరటీస్పూను సాల్ట్‌వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పదినిమిషాల?టు మర్దన చేసి చల్లని నీటితో కడిగేయాలి. ఈ స్క్రబ్ వదులుగా ఉన్న చర్మాన్ని బిగుతుగా మార్చడంతోపాటు, బ్లాక్‌హెడ్స్‌ను తొలగించి చర్మం కాంతిమంతం గా మెరిసేలా చేస్తుంది.

డార్క్ సర్కిల్స్

టీ స్పూన్ టొమాటో గుజ్జు, సెనగపిండి, చిటికెడు పసుపు, అర టీస్పూన్ నిమ్మరసం కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి, కళ్ల మీద గుండ్రంగా తరిగిన కీరా ముక్కలు ఉంచి ఇరవై నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి. తర్వాత ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తుంటే కళ్ల కింద నల్లని వలయాలు తగ్గుముఖం పట్టి, ముఖం కాంతిమంతం అవుతుంది.


నోట్: ఆరోగ్యాన్ని మించిన అందంలేదు. సమతులం ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, సరిపడినన్ని నీళ్లు తాగడం, చక్కటి నిద్ర, ఒత్తిడి లేని జీవితం, నలుగురితో హాయిగా, సంతోషంగా నవ్వుతూ గడిపే జీవన శైలి,ఏదైనా అనారోగ్యసమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం ఇవి చాలు ఆరోగ్యంగా ఆనందంగా జీవించడానికి.

# రోగ నిర్ధారణతో బ్రెయిన్ ట్యూమర్ ఆటకట్టు

### వ్యాధి నియంత్రణలో నిర్ధారణ, చికిత్సలే కీలకం

### ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవం సందర్భంగా ఆలీవ్ హాస్పిటల్ అవగాహన సదస్సు

హైదరాబాద్: ప్రాణాంతకమైన బ్రెయిన్ ట్యూమర్ (మెదడులో కణతులు) వ్యాధి ఆట కట్టించాలంటే సరైన నిర్ధారణ, చికిత్సలే కీలకమని హైదరాబాదులోని ప్రముఖ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆలివ్ హాస్పిటల్ న్యూరాలజీ నిపుణులు పేర్కొన్నారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవం సందర్భంగా ఈ వ్యాధిపై పౌరులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాన్నినిర్వహించారు. ఆరోగ్య సంరక్షణలో విశ్వసనీయత, మెరుగైన ఆరోగ్య ఫలితాలను సాధిస్తూ, రోగుల ప్రాణాలను కాపాడటానికి అంకితభావంతో వైద్య సేవలు అందించేందుకు ఆలివ్ హాస్పిటల్ కృషి చేస్తోంది. జీవితాన్నితల కిందులు చేసే బ్రెయిన్ ట్యూమర్ల వ్యాధిపైప్రజలలో అవగాహన పెంచడం, ముందస్తుజాగ్రత్తలతో పలు సూచనలు చేస్తున్నారు. క్యాన్సర్, క్యాన్సర్ కాని మెదడు కణితులు ఏటా వేలాది మంది భారతీయులను ప్రభావితం చేస్తున్నాయి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ డేటా ప్రకారం, దేశంలో ప్రతి ఏడాది 40,000 కంటే ఎక్కువ మందిలో కొత్తగా మెదడు కణితులు గుర్తించబడుతున్నాయి. తరచూ తలనొప్పి, దృష్టిలోపాలు, జ్ఞాపకశక్తికోల్పోవడం వంటి నిర్దిష్ట లక్షణాల ఫలితంగా అనేక ఇతర కణితులు గుర్తించబడకుండా పోతున్నాయని నిపుణులు వివరించారు. ఈ సందర్భంగా "ఆలివ్ హాస్పిటల్ గత ఏడాదిలోనే బ్రెయిన్ ట్యూమర్ కన్సల్టేషన్లలో 20% పెరుగుదలను నమోదు చేసిందనీ గుర్తుచేశారు. ఆసుపత్రిలోని న్యూరాలజీ, న్యూరోసర్జరీ యూనిట్లు అధునాతన %వీ=×% డయాగ్నస్టిక్స్, స్టీరియోటాక్టిక్ సర్జికల్ పరికరాలు, న్యూరాలజీ , పాలియేటివ్ కేర్, పునరావాస మద్దతుతో కూడిన మల్టీడిసిప్లినరీ కేర్ మోడల్ తో పూర్తిగా అధునాతన పరిజ్ఞానంతో వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంది. 'మెదడు కణితులు మోసపూరితమైనవిబీ లక్షణాలు ఎప్పుడూ బయటపడవు. అప్పుడప్పుడు ఇది నిరంతర తలనొప్పిలేదా ప్రవర్తనలో వివరించలేని మార్పువంటి సాధారణమైన దానితో ప్రారంభమవుతుంది. తమ శరీరాలపైశ్రద్ధ వహించాలని, ముందుగానే తమను తాము తనిఖీ చేసుకునేలా ఆలివ్ హాస్పిటల్ ప్రోత్సహిస్తోంది. రోగాన్నిగుర్తించడం వల్ల సంరక్షణ నాణ్యత పెరుగుతుందనీ, రోగి యొక్క జీవన నాణ్యత పెరుగుతోంది. వ్యాధిని నయం చేయడంతో పాటుగా, రోగులు, వారి కుటుంబాలకు చికిత్స, ఆరోగ్య సంరక్షణ ప్రయాణంలో ప్రతి అడుగులో తోడుగా ఉంటుంది అని ఆలివ్ హాస్పిటల్ లోని సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ మొహమ్మద్ మహమూద్ అలీ అన్నారు. క్లినికల్ సూక్ష్మ నైపుణ్యాలతోపాటుగా, రోగి, వారి కుటుంబాలకు భావోద్వేగ, మానసిక భారాన్నికూడా పెంచుతుందని అర్థం చేసుకోవాలి. ఆలివ్ హాస్పిటల్ సకాలంలో నాడీ మూల్యాంకన చేసి వ్యాధిని కచ్చితత్వంతో గుర్తిస్తుంది. మెదడు కణితుల ప్రారంభ దశను కొన్నిసూచనల ద్వారా గుర్తించే వీలు ఉందని, దీంతో అధిక ప్రమాదకరమైన పరిస్థితుల నుంచి బయటపడే వీలుంటుందని వైద్యులు పేర్కొన్నారు. జూన్ 8న నిర్వహించే ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ డే సంధ్భరంగా వ్యాధిపైఉన్న అపోహలను తొలగించడానికి, న్యూరో హెల్త్ పై అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నట్లుగా అలీ హాస్పిటల్ న్యూరో విభాగం వైద్యులు వివరించారు.



### ఆలివ్ హాస్పిటల్ గురించి:

ఆరోగ్య సంరక్షణకు భరోసానిస్తూతెలంగాణ రాష్ట్ర స్థాయిలో ఆలివ్ హాస్పిటల్స్కృషి చేస్తుంది. ఆధునాతన వైద్య సదుపాయాలు, నాణ్యత, నిబద్ధతతో కూడిన సమగ్ర ఆరోగ్య సంరక్షణయే లక్ష్యంగా 2010 నుంచి వైద్య సేవలు అందిస్తోంది. మానవాళికి ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడం కోసం సాధారణ వైద్య సంస్థగా మొదలుపెట్టి.. ఆనాటి కాలంలోనే రోగి సంరక్షణలో అత్యుత్తమ ప్రతిభతో ఆలివ్ హాస్పిటల్ తెలంగాణలోని ప్రముఖ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులలో ఒకటిగా నిలిచింది. 210 పడకలతో, అత్యాధునిక మల్టీస్పెషాలిటీ హెల్త్కేర్ సౌకర్యం వివిధ స్పెషాలిటీలలో విస్తృత శ్రేణి వైద్య సేవలను అందిస్తుంది. కార్డియాక్ కేర్, ఎమర్జెన్సీసర్వీసెస్, న్యూరో కేర్, కిడ్నీకేర్, యూరాలజీ, ఆర్థోపెడిక్స్, జాయింట్ రీప్లేస్ మెంట్స్, గైనకాలజికల్ సర్వీసెస్, అడ్వాన్స్డ్ డయాగ్నస్టిక్స్, ఇంటర్వెన్షనల్ సర్వీసెస్ వంటి రంగాలలో అనేక అధునాతన విధానాలలో మార్గదర్శకత్వం వహించింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్నిఉపయోగించి, సమర్థులైన వైద్యులతో వైద్యం అందించడానికి కట్టుబడి ఉంది. దేశంలో ఆరోగ్య సంరక్షణ నాణ్యత ప్రమాణాలను కలిగి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ఫర్ హాస్పిటల్స్%-% హెల్త్కేర్ నుండి జాతీయ స్థాయిలో గుర్తింపును కలిగి ఉంది.

Printed by RATNA GRAPHICS, at H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana. Published by CHERUKU UPENDAR on behalf of CHERUKU UPENDAR ( HAMSA PUBLICATIONS ), Printed at HYDERABAD and Pulblished at H.No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPUR MET MANDAL,Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City,Telangana. *Editor : CHERUKU UPENDAR E-mail: prabhathasuryudueditor@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555